PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 326 | విజయవాడ, మంగళవారం 27 జూన్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 27 June 2023 | Rs

పాఠ్యపుస్తకాల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

- టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి
- హాస్టళ్లల్లో మెరుగైన వసతులు కల్పించండి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

లోపలి పేజీలో..



కూనవరం పడవరేవు నుంచి ఏలూరు జిల్లాకు పడవలో బయలుదేరిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర బృందం

లోపలి పేజీలో..



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు, వై వెంకటేశ్వరరావు, కిరణ్, అశోక్

నిర్వాసితులకు న్యాయం

గవర్నరుకు విన్నవించిన సిపిఎం ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ముంపు ప్రాంతంలోని నిర్వాసితులకు న్యాయం చేయాలని, అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయాలని గవర్నరును సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. సోమవారం సాయంత్రం గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బొప్పెన కిరణ్, ఎ.అశోక్ కలిశారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, వారికి న్యాయమైన పరిహారం అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. బాధితుల తరపున సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన చేపట్టిన పాదయాత్ర వివరాలనూ గవర్నరు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం గురించి మినహా భూములు, నివాసాలు కోల్పోతున్న గిరిజనుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పూర్తిస్థాయిలో పునరావాసం పునర్నిర్మాణం చేపట్టకుండా అక్కడ నుండి ప్రజలను తరలించొద్దని కోరారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలను నిలిపేస్తున్నారని, వాటిని కొనసాగించాలని, వరద ముంపుపై మరోసారి రీసర్వే చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లోనూ ఒకేసారి పునరావాసం చేపట్టాలని, విడతల వారీగా చేయొద్దని, మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్అండ్ఆర్ పథకాన్ని అమలు చేయాలని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు రూ.20 లక్షలు పరిహారం ఇవ్వాలని గరవ్నరును కోరామన్నారు. ముంపు ప్రాంతం నుండి తరలించే ప్రతి కుటుంబానికి రూ.10.50 లక్షలు ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం జిఓ నెంబరు 224 ఇచ్చారని, దాన్ని పూర్తిగా అమలు చేయాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు, వివాహమైన వారికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను పునరావాస ప్రాంతాల్లోనే కొనసాగించాలని కోరారు. పునరావాస కాలనీల్లో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే వైద్యారోగ్య సదుపాయాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ.. పోలవరం ముంపు విషయంలో ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. తప్పుడు కాంటూరు లెక్కలతో

మిగతా 2లో

పట్టణాల్లో ల్యాండ్ బ్యాంకులు

- ప్రభుత్వ భూముల నిర్వహణ బాధ్యత యుడిఎలకు
- ప్రతిపాదనలు తయారు చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలు వేగవంతంగా విస్తరిస్తుండటం, పలు మండలాలు మున్సిపాలిటీ పరిధిలో చేరిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, కనీస సౌకర్యాల ఏర్పాటు పేరుతో ప్రభుత్వం ఆయా పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములన్నింటిని కలిపి ల్యాండ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలోని ప్రభుత్వ భూములను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యుడిఎ)లకు అప్పజెప్పాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎపిఎంఆర్‌యుడిఎ యాక్ట్-2016 ప్రకారం పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కనీస వసతులు కల్పించి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యతలను యుడిఎలకు ప్రభుత్వం అప్పజెప్పనుంది. పట్టణాల్లోని ప్రభుత్వ భూములను యుద్ధ ప్రాతిపదికన గుర్తించాలంటూ జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి తాజాగా ఆదేశాలు వెళ్లాయి. పట్టణ ప్రాంతాల్లోని భూముల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపిన అనంతరం ప్రభుత్వం ల్యాండ్ బ్యాంకులకు సంబంధించి ఓ కీలక నిర్ణయం తీసుకుంటుంది. ఇందుకు సంబంధించిన మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి నేతృత్వంలో 07.06.23న ఓ కీలక సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మండలాలు మున్సిపాలిటీ పరిధిలోకి, కొత్తగా చేరిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల విస్తరణకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు అవసరమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



వేగవంతంగా పట్టణాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల నుంచి ల్యాండ్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలో వినతులు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ల్యాండ్ బ్యాంకుల ఏర్పాటు ప్రస్తావనను ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని భూములను పరిశ్రమలు, సంస్థల పేరుతో ప్రభుత్వాలు సంపన్నులకు కట్టబెట్టాయి. ఇక పట్టణ ప్రాంతాల్లోని భూములను కూడా వారికి అప్పగించడానికి అవసరమైన పథకం రూపొందించడంలో భాగమే ఈ ల్యాండ్ బ్యాంకులని పరిశీలకుల భావన. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 21 యుడిఎలు ఉండగా వాటి పరిధిలో 667 మండలాలు, 121 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 4 కోట్ల మందికి పైగా జనాభా నివసిస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ప్రధానంగా ఆయా పట్టణాల్లో మాస్టర్ ప్లాన్స్, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్స్, జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్స్, టౌన్ ప్లానింగ్ (ప్రజలకు కనీస సౌకర్యాలు, మౌలిక వసతులకు తగ్గట్లు) అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఆయా పట్టణాల్లోని స్థానిక సంస్థలపై ఉంది. ఎపిఎంఆర్‌యుడిఎ చట్టం-2016లోని సెక్షన్ 96 ప్రకారం ల్యాండ్ డెవలప్‌మెంట్ బ్యాంకును ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. సెక్షన్ 97(1) ప్రకారం ప్రభుత్వం ప్రభుత్వ భూములను యుడిఎలకు అప్పజెప్పే అధికారం ఉంటుంది. 97(2) ప్రకారం అభివృద్ధి పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వ భూములు యుడిఎవద్ద ఉంచేందుకు ప్రభుత్వం అనుమతినిస్తోంది.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- పశుసంవర్ధక కార్యాలయాన్ని ముట్టడించిన డివైఎఫ్ఐ
- అరెస్టు చేసిన పోలీసులు

లోపలి పేజీలో..

ఒడిశాలో ఘోరం

- రెండు బస్సులు ఢీకొని 12 మంది మృతి

వీధుల్లో కాదు.. కోర్టులో పోరాడతాం

- అగ్రశ్రేణి రెజ్లర్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులపై కోర్టులో పోరాటం కొనసాగిస్తామని రెజ్లర్లు ప్రకటించారు. బ్రిజ్ భూషణ్‌పై ఛార్జిషీటు దాఖలు చేస్తామన్న హామీని కేంద్రం నెరవేర్చిందని రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, భజరంగ్ పునియా తెలిపారు. ఈ మేరకు సోమవారం ముగ్గురు రెజ్లర్లు ట్వీట్ చేశారు. రెజ్లర్లతో ప్రభుత్వం చర్చలు, ఈ నెల 15న బ్రిజ్ భూషణ్‌పై కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సాక్షి మాలిక్ తెలిపారు. ఈ కేసులో తమకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని, అయితే అది వీధుల్లో కాదు.. కోర్టులో అని మహిళా రెజ్లర్లు పేర్కొన్నారు. రెజ్లింగ్ అసోసియేషన్‌లో సంస్కరణలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రక్రియ ప్రారంభమైందని, జులై 11న జరిగే రెజ్లింగ్ అసోసియేషన్ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నామని సాక్షి మాలిక్ ట్వీట్ చేశారు. ఈ ప్రకటన చేసిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ కొన్ని రోజులు సోషల్ మీడియా నుంచి విరామం తీసుకున్నట్లు ట్వీట్ చేశారు.

బాధ్యతల నుంచి బ్రిజ్‌భూషణ్ మార్పు

ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ డబ్ల్యుఎఫ్ఐ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతల నుంచి రిలీవ్ చేయబడ్డారు. నేరం రుజువైతే బ్రిజ్ భూషణ్ సింగ్‌కు మూడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అస్సాం హైకోర్టులో రెజ్లింగ్ ఫెడరేషన్ ఎన్నికలపై ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఒఎ), క్రీడా మంత్రిత్వ శాఖ, డబ్ల్యుఎఫ్ఐకి వ్యతిరేకంగా అస్సాం రెజ్లింగ్ అసోసియేషన్ (ఎడబ్ల్యుఎ) దాఖలు చేసిన పిటిషన్‌పై అస్సాం హైకోర్టు స్టే విధించింది.

మోడీ దేశంలో గాడ్సే, విదేశాల్లో గాంధీ

- రాష్ట్ర స్థాయిలోనే కూటములు
- సిమ్లా సమావేశానికి మరిన్ని పార్టీలు చేరతాయి
- మీడియా సమావేశంలో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో




'ప్రతి రాష్ట్రంలోని పరిస్థితి భిన్నంగా ఉంటుంది. రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా చర్చలు రాష్ట్రస్థాయిల్లో జరగాలని నిర్ణయించాం. అందుకనుగుణంగానే ఎన్నికల నిర్వహణ ఉంటుంది. రాష్ట్ర స్థాయిల్లోనే కూటములు ఏర్పాటు చేస్తాం. తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర వలే ఇతర రాష్ట్రాల్లో కూడా ఎన్నికల అవగాహనలు ఉంటాయి' అని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. శని, ఆదివారాల్లో సిపిఎం కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పొలిట్ బ్యూరో సమావేశం తీసుకున్న నిర్ణయాలను సీతారాం ఏచూరి వివరించారు. ప్రధాని మోడీ విదేశాల్లో ఉంటే గాంధీ, ఇండియాలో ఉంటే గాడ్సే అని విమర్శించారు. మోడీ అమెరికా పర్యటనలో దేశ ప్రయోజనాలు లేవని, ఇప్పటికే ఉన్న ఒప్పందాలనే తిరగదోడారని విమర్శించారు. పాట్నాలో జరిగిన సమావేశంలో ప్రతిపక్షాలన్నీ కలిసి పని చేయాలని నిర్ణయించామన్నారు. సిమ్లాలో జరిగే ప్రతిపక్షాల సమావేశానికి మరిన్ని పార్టీలు చేరతాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, విద్వేష, టెర్రర్ రాజకీయాలను వ్యతిరేకించడం, ప్రజా స్వామ్య హక్కులు, మానవ హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉమ్మడి ప్రచారోద్యమం నిర్వహించాలని ఆ సమావేశంలో నిర్ణయించామన్నారు. ప్రజా జీవనోపాధి సమస్యలైన అంతులేని నిరుద్యోగం, ధరలు పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. గత రెండేళ్లలో ఒక శాతం కార్పొరేట్ల వద్ద 40 శాతానికి పైబడి సంపద కేంద్రీకృతమైందని, అట్టడుగున ఉన్న 50 శాతం మంది ప్రజల వద్ద కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉందని, ఆ రకంగా ఆర్థిక అసమానతలు పెరిగాయని తెలిపారు. మణిపూర్‌లో బిజెపి మతోన్మాద ఎత్తుగడలను ఆపాలని, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌కు అఖిలపక్షాన్ని పంపాలన్న ప్రతిపక్షాల ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని, అయితే ఇదే బిజెపి గతంలో జమ్మూకాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై అఖిలపక్షాన్ని పంపాలని డిమాండ్ చేసిందని తెలిపారు. మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకు లా కమిషన్ యూనిఫాం సివిల్ కోడ్‌పై మళ్లీ సంప్రదింపులు ప్రారంభించిందని, ఇప్పటికే 2016 నుంచి 2018 వరకు రెండేళ్లు గత లా కమిషన్ సంప్రదింపులు జరిపిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు లా కమిషన్ సంప్రదింపుల్లో అర్థం లేదని అన్నారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను రుద్దొద్దని హితవు పలికారు. మహిళలతో సహా పౌరులందరికీ సమానత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కార్పొరేట్లకు రూ.11 లక్షల కోట్ల రుణాలు రద్దు చేశారని, ఇప్పుడు ఆర్‌బిఐ ఉత్తర్వులతో ప్రజల పొదుపులను దోపిడీ చేసేందుకు చట్టబద్ధత కల్పిస్తున్నారని విమర్శించారు. రుణాలు చెల్లించే సామర్థ్యమున్నప్పటికీ, రుణాలు చెల్లించటం లేదని, వారికి అనుకూలంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రాలకు బియ్యం సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం ఐదు కేజీల బియ్యం ఉచితంగా ఇస్తుందని, కానీ అదే పథకాన్ని రాష్ట్రాలు అమలు చేస్తే అనుమతించటం లేదని విమర్శించారు. రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యం పనికిరాదని హితవు పలికారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడో శుక్రవారం గ్రీవెన్స్‌డే

- వారానికి 5 రోజులు పనిదినాలు మరో ఏడాది పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల సంక్షేమం, వ్యక్తిగత ఫిర్యాదులపై జిల్లా కలెక్టరు, హెచ్‌ఒడిలు నెలలో మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌డే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 1233ని విడుదల చేసింది. ఉద్యోగులు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించి జెకెసి (జగనన్నకు చెబుదాం)లో ప్రత్యేక ఐడిలతో నమోదు చేస్తారు. ప్రత్యేక ఐడిలను ఉపయోగించడం ద్వారా ఫిర్యాదులు ఏ స్థితిలో ఉన్నాయనే విషయాన్ని ట్రాక్ చేసే అవకాశం ఉంటుంది. కలెక్టర్లు, హెచ్‌ఒడిలు రెండు వారాలకు ఒకసారి ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించనున్నారు. అదే విధంగా సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు వారానికి 5 రోజులు పనిదినాలు ప్రస్తుతం అమలవుతుండగా గడువు నేటితో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో మరో ఏడాది 5 రోజులు పనిదినాలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



లా నేస్తం చెక్కు నమూనాను న్యాయవాదులకు అందజేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు

- బటన్ నొక్కి వైఎస్ఆర్ లా నేస్తం జమ చేసిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువ న్యాయవాదులు న్యాయవాద వృత్తిలో రాణించేందుకు తొలి మూడేళ్లపాటు నెలకు రూ.5 వేలచొప్పున వైఎస్ఆర్ లా నేస్తం పేరుతో స్టైఫండ్ ఇస్తున్న రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదని, రాష్ట్రంలో అమలవుతున్న ఈ పథకాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ లా నేస్తం పథకానికి సంబంధించి 2,677 మంది జూనియర్ న్యాయవాదులకు ఐదు నెలలకుగానూ ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున సిఎం బటన్ నొక్కి రూ.6.12 కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి సోమవారం జమ చేశారు. రాష్ట్రంలో మూడేళ్లుగా వైఎస్ఆర్ లా నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని సిఎం తెలిపారు. యువ న్యాయవాదులకు ఏడాదికి ప్రభుత్వం ఇచ్చే రూ.60 వేలు వారు ప్రాక్టీస్ పరంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందన్నారు. మూడేళ్ల కాలంలో ఒక్కొక్కరికీ రూ.1.8 లక్షల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందించిందని తెలిపారు. ఇప్పటిదాకా ఈ పథకం కింద 5,781 మందికి రూ.41.52 కోట్లను అందించామన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్టును ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకూ మెడిక్లెయిమ్, ఇతర అవసరాల కోసం రూ.25 కోట్లను న్యాయవాదుల కోసం ఖర్చు చేశామన్నారు. న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం తోడుగా వుంటుందని, ఇదే స్ఫూర్తితో

మిగతా 2లో



మణిపూర్‌పై

సీనియర్ మంత్రులతో మోడీ భేటీ

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై సోమవారం నాడు సీనియర్ మంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియంశాఖ మంత్రి హరదీప్ సింగ్ పురీ, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం ప్రారంభమైన ఈ సమావేశం సుమారు రెండు గంటల సేపు జరిగింది. అమెరికా, ఈజిప్టు దేశాల పర్యటనను ముగించుకుని వచ్చిన తరువాత తాపీగా ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి విదేశాల్లో ఉన్న సమయంలో అమిత్ షా నిర్వహించిన అఖిలపక్ష సమావేశం ఎలాంటి ఫలితమూ ఇవ్వలేదు. మణిపూర్‌లో మే 3 నుంచి ఇప్పటికీ కొనసాగుతున్న హింసాకాండలో జరిగిన నష్టం గురించి ఈ సమావేశంలో చర్చించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నారు. మణిపూర్ ప్రభుత్వం అభ్యర్థిస్తున్న ఆర్థిక ప్యాకేజీపై కూడా సోమవారం సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. మణిపూర్‌లో పరిస్థితిపై చర్చించేందుకు ఆదివారం సాయంత్రం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ బీరెన్‌సింగ్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో బీరేన్‌సింగ్ మాట్లాడుతూ నూతన శాంతి ప్రక్రియను ప్రారంభిస్తానచెప్పారు. ఇటీవల జరిగిన అఖిలపక్ష సమావేశంలో హింసాకాండను నివారించడంలో విఫలమైనందుకు ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని ప్రతిపక్ష నాయకులు ప్రధానంగా డిమాండ్ చేశారు. మణిపూర్ హింసాకాండాలో ఇప్పటి వరకూ 131 మందికి పైగా మరణించగా, అనేక వందల మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇళ్లు, దుకాణాలకు నిప్పు పెట్టారు.

వైద్య విద్యార్థి ఆత్మహత్య

- కర్నూలు విశ్వభారతి కాలేజీలో ఘటన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్/ గూడూరు



కర్నూలు జిల్లా విశ్వభారతి వైద్య కళాశాలలో చదువుతున్న ఓ వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగలాపురం ఎస్ఐ సోమ్లా నాయక్ కథనం మేరకు... గూడూరు మండలం పెంచకలపాడు గ్రామం పరిధిలో ఉన్న విశ్వభారతి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్న లోకేష్ (21) ఆదివారం రాత్రి వైద్య కళాశాల హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక విద్యార్థులు గుర్తించారు. విద్యార్థిని కర్నూలు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి పరమానందరావు ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆత్మహత్య వెనుక ప్రేమ వ్యవహారం, విద్యార్థుల మధ్య ఏవైనా కలహాలు గాని లేదా విద్యపరంగా ఒత్తిడి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడా? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదిరిద్దాం !

- ప్యాంగ్యాంగ్ వీధుల్లో లక్షలాదిమంది ప్రదర్శన
- ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిన



అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేక పోరాట దినం సందర్భంగా ప్యాంగాంగ్ వీధుల్లో బ్రహ్మాండమైన ప్రదర్శన

ప్యాంగ్యాంగ్ : అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఉత్తర కొరియా ప్రజలు తీవ్రంగా ఖండించారు. యుద్ధానికి ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిన చేశారు. ఆదివారం దాదాపు లక్షా 20వేల మంది ప్యాంగ్యాంగ్ వీధుల్లోకి వచ్చారు. కొరియా యుద్ధం ప్రారంభమై 73ఏళ్లు అయిన సందర్భంగా రాజధానిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో పాల్గొన్న వారిలో కార్మికులు, యువత, విద్యార్థులే ఎక్కువగా ఉండడం విశేషం రాజధానిలోని మే డే స్టేడియం వద్ద, నగరంలోని వివిధ ప్రదేశాల్లో ప్రదర్శనలు నిర్వహించినట్లు ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కెసిఎన్ఎ తెలిపింది. ఉత్తర కొరియాను సమూలంగా తుడిచిపెట్టేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు చేపట్టిన యుద్ధానికి ప్రతీకారం తీర్చుకుంటామని వారు ప్రతిన బూనారు. లక్షా 14వేలుమంది పట్టే సామర్థ్యం కలిగిన స్టేడియం జనంతో కిక్కిరిసిపోయింది. 'యావత్ అమెరికా భూభాగం మా కాల్పుల పరిధిలోనే వుంది.', "సామ్రాజ్యవాద అమెరికా శాంతి విధ్వంసకర్త' అని రాసి వున్న ప్లకార్డులను ప్రదర్శకులు చేబూనడం కనిపించింది. ఉత్తర కొరియా ప్రముఖులంతా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

సైనిక ఘర్షణ వైపు, అణ్వాయుధ విన్యాసాల వైపు అమెరికా మొగ్గిందని వారు విమర్శించారు. కొరియా ద్వీపకల్పాన్ని ముక్కలు చేసే సామ్రాజ్యవాదుల కుట్ర ఫలితమే కొరియా యుద్ధం అని అన్నారు. 1950 జూన్ 25 నుండి మూడేళ్ళ పాటు సాగిన ఈ యుద్ధంలో దాదాపు 20లక్షల మంది చనిపోయారు. శాంతి ఒప్పందం కన్నా కాల్పుల విరమణ ఒప్పందంతోనే ఆనాటి యుద్ధం విరమించినా ఉత్తర, దక్షిణ కొరియాలు ఇప్పటికీ సాంకేతికంగా యుద్ధం చేస్తున్నట్టే లెక్క. దేశ మిలటరీని ఆధునీకరిస్తామని ఏప్రిల్‌లో ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. అమెరికా దురాక్రమణ, ఆధిపత్యవాదానికి అడ్డుకట్టవేసేందుకు శాయశక్తులా పోరాడతామని ఉత్తర కొరియా నేత తెలిపారు.

సిఎంను కలిసిన 10 మంది ఐఎఎస్ ప్రొబేషనర్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో సోమవారం పది మంది ఐఎఎస్ ప్రొబేషనర్స్ (ఎపి కేడర్ అసిస్టెంట్ కలెక్టర్స్ అండర్ ట్రైనింగ్ 2022 బ్యాచ్) కలిశారు. సిఎంను కలిసిన వారిలో బి.స్మరణ్‌రాజ్ (అనకాపల్లి జిల్లాకు అలాట్‌మెంట్), బి సహదిత్ వెంకట్ త్రివినాగ్ (విజయనగరం), సి యశ్వంత్ కుమార్‌రెడ్డి (తూర్పుగోదావరి), కల్పశ్రీ కెఆర్ (పల్నాడు), కుషల్‌జైన్ (అనంతపురం), మంత్రి మౌర్య భరద్వాజ్ (ప్రకాశం జిల్లా) రామవేంద్రమీనా (శ్రీకాకుళం), సౌర్యమన్‌పటేల్ (ప్రకాశం), తిరుమణి శ్రీపూజ (ఏలూరు), వి సంజనా సింహా (నెల్లూరు) ఉన్నారు. వీరితోపాటు ఎపి హెచ్‌ఆర్‌డి డిజి ఆర్‌పి సిసోడియా, ఎపి హెచ్‌ఆర్‌డి జెడిజి పిఎస్ ప్రద్యుమ్న ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రిక ప్రజాశక్తి మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చని, నచ్చిన అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పదల్చుకున్నది క్లుప్తంగా సూటిగా ఉండాలి. చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పాఠ్యపుస్తకాల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

- టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి
- హాస్టళ్లల్లో మెరుగైన వసతులు కల్పించండి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు



కాకినాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు తక్షణమే పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రోడ్కెక్కారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో మెరుగైన వసతులు సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సోమవారం ర్యాలీలు, కలెక్టరేట్, ఆర్డిఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

అనంతపురంలో విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులతో మాట్లాడాలని నాయకులు పట్టుబట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్‌తో పాటు పలువురిని పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.పావని తదితరులు పాల్గొన్నారు. విశాఖ కలెక్టరేట్ వద్ద, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. టీచర్లు లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. కర్నూలులో కెవిఆర్, టౌన్ మోడల్ కళాశాలల నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే ధర్నా నిర్వహించారు.

గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన తెలియజేసి, అనంతరం స్పందనలో అధికారులకు అర్జీ అందజేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడులో తహశీల్దార్ కార్యాలయం ఆందోళన చేపట్టారు. కాకినాడలో సుందరయ్యభవన్ నుంచి ధర్నా చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అప్‌గ్రేడ్ అయిన కళాశాలల్లో అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.



అనంతపురంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిని బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు



తాడేపల్లిలో నిధి వసూలులో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి తదితరులు

సంఘీభావం వెల్లువ

- పోలవరం నిర్వాసితుల పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా విరాళాల సేకరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

పోలవరం నిర్వాసితులకు సంఘీభావం వెల్లువెత్తింది. సిపిఎం పిలుపు మేరకు ప్రజలు విరివిరిగా విరాళాలు అందజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో భాగంగా జరుగుతున్న మహా పాదయాత్ర కోసం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిధుల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి విరాళాలు అందజేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి సెంటర్‌లో చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. నిర్వాసితుల హక్కుల సాధన కోసం గత రోజుల నుంచి సాగుతున్న పాదయాత్రలో వందలాది మంది పాల్గొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఆర్థిక వనరులు అవసరం అవుతున్నాయన్నారు. ప్రజలు స్పందించి పోలవరం పోరుకేక పాదయాత్రకు మద్దతు తెలిపి విరాళాలు ఇవ్వాలని కోరారు. గుంటూరు, ప్రకాశం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి తదితర జిల్లాల్లో సిపిఎం ఆధ్వర్యాన విరాళాల సేకరణ జరిగింది. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది.



బొత్సాకు వినతి పత్రం అందజేస్తున్న గెస్ట్ టీచర్లు

న్యాయం చేయాలని బొత్సకు గెస్ట్ టీచర్ల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కెజిబివి పాఠశాలల్లో బోధనా సిబ్బంది నియామకానికి ప్రభుత్వమిచ్చిన నోటిఫికేషన్లో మార్పులు చేసి ప్రస్తుతం పనిచేస్తున్న తెలుగు, ఇంగ్లీషు, మిగిలిన గెస్ట్ పిజిటిలకు న్యాయం చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణను గెస్ట్ టీచర్లు కోరారు. విజయనగరంలోని మంత్రి నివాసంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి కాంతారావు ఆధ్వర్యాన మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 నుంచి ఇంటర్ విద్యను బోధించడానికి కొంతమందిని పార్ట్ టైం పిజిటిలతో పాటు మరి కొంతమందిని గెస్ట్ పిజిటిలుగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఈ ఏడాది ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్స్, టీచర్స్, పిజిటిలను కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన ప్రాధాన్యత సమగ్ర శిక్ష నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల ప్రస్తుతం పని చేస్తున్న తెలుగు, ఇంగ్లీషు, మిగిలిన సబ్జెక్ట్ గెస్ట్ పిజిటిలకు ఉద్యోగాలు పోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సమగ్ర శిక్ష కెజిబివిలలో నియామకాలకు ఇచ్చిన నోటిఫికేషన్‌లో మార్పులు చేసి ప్రస్తుతం పని ఈ చేస్తున్న గెస్ట్ పిజిటిలకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గెస్ట్ టీచర్లు ఉమా, సూరిడమ్మ, తనూజ, ప్రవీణ, ధనలక్ష్మి, జ్యోతి, వరలక్ష్మి, రామకుమారి, కవిత ఉన్నారు.

ఆలయ భూముల కౌలురైతులకు సాగుహక్కు పత్రాలివ్వాలి

- ఎపి కౌలురైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని దేవాదాయశాఖ భూములను సాగుచేసుకుంటున్న కౌలురైతులకు సాగుహక్కు పత్రాలివ్వాలని ఎపి కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనరు సత్యనారాయణను ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు పంటలు తీవ్రంగా దెబ్బతింటే కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం గానీ, బీమా గానీ అందడం లేదని తెలిపారు.

విశాఖలో విమానం అత్యవసర ల్యాండింగ్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఢిల్లీ నుంచి పోర్టు బెయిర్ (అండమాన్)కు ఆదివారం వెళ్లాల్సిన ఎయిర్ ఇండియాకు చెందిన విమానం వాతావరణం అనుకూలించక విశాఖపట్నం ఎయిర్ పోర్టులో అదే రోజు సాయంత్రం అత్యవసర ల్యాండింగ్ అయింది. అందులోని ప్రయాణికులను విశాఖలోని ఓ ప్రయివేటు హోటల్‌లో సోమవారం మధ్యాహ్నం వరకూ ఉంచి ఎయిర్ ఇండియాకు చెందిన విమానంలో అండమాన్ నికోబర్‌కు చేరవేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి నేరుగా పోర్టుబెయిర్‌కు చేరుకోవాల్సి ఉన్న సమయంలో వర్షం కారణంగా వెనక్కి మరలించి విశాఖ ఎయిర్‌పోర్టుకు విమానాన్ని తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రయాణికులందరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరినట్టు తెలుస్తోంది.

దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు

మొదటి పేజీ తరువాయి

ప్రతి న్యాయవాది పేదలపట్ల మమకారం చూపాలని కోరారు. అర్హులైన వారు వుంటే వైఎస్ఆర్ లా నేస్తం పథకానికి దరఖాస్తును లా సెక్రటరీకి చేసుకోవాలని సూచించారు. వైఎస్ఆర్ లా నేస్తం పథకానికి సంబంధించి న్యాయవాదుల ఇబ్బందులను అధిగమించేందుకు 1902 నెంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, లా సెక్రటరీ జి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలిరేట్లు పెంపునకు చర్యలు : ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ ఎమ్‌డి వాసుదేవరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ గోడౌన్‌లలో పనిచేస్తున్న హమాలీల కూలిరేట్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ ఎమ్‌డి వాసుదేవరెడ్డి హామీ ఇచ్చారు.

ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ గోడౌన్‌లలో పనిచేసే హమాలీలు సిఐటియు అనుబంధ సంఘమైన ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ ఆధ్వర్యాన ఆందోళనలకు సమాయత్తమవడంతో సోమవారం యూనియన్ నాయకులను వాసుదేవరెడ్డి చర్చలకు ఆహ్వానించారు. ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వి సుబ్బారెడ్డి, ఎం మదన్‌మోహన్ తదితరులతో సమావేశమై హమాలీల సమస్యలను చర్చించారు. కూలిరేట్లు పెంచకుండా లిక్కర్ అండ్ బీర్ సప్లయర్స్ అసోసియేషన్ నాయకులు హమాలీలపై ఎదురుదాడికి దిగుతున్నారని యూనియన్ నాయకులు ఎమ్‌డికి ఫిర్యాదు చేశారు. బీర్ అండ్ లిక్కర్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం కామేశ్వరరావు హమాలీలను అవమానించేలా మాట్లాడుతున్నారని తెలిపారు. హమాలీలకు కూలిరేట్లను పెంచడంతోపాటు ఎరియర్స్ చెల్లించాలని కోరారు. హమాలీల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని, జులై 3న సప్లయర్స్‌తో జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి కూలిరేట్లపై సానుకూల నిర్ణయం వచ్చేలా చొరవ తీసుకుంటామని వాసుదేవరెడ్డి హామీ ఇచ్చారు.



సిపిఐ జీపు జాతా ముగింపు సందర్భంగా పోలవరం సభలో అభివాదం చేస్తున్న రామకృష్ణ, తదితరులు

రాష్ట్రం అభివృద్ధి కావాలంటే పోలవరం పూర్తి చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పోలవరం పూర్తి చేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన జీపు జాతా ముగింపు సందర్భంగా పోలవరం బాపూజీ కాలనీలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షతన సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. సభలో రామకృష్ణ మాట్లాడుతూ.. పోలవరం నిర్వాసితులకు కేంద్రం నిధులు కేటాయించడం లేదని, సిఎం కూడా దీనిపై ఏమీ మాట్లాడటం లేదని విమర్శించారు. నిర్వాసితులకు రూ.30 వేల కోట్లు కేటాయిస్తేగాని సమస్యలు పరిష్కారం కావన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కలిసొచ్చే అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమిస్తామని ప్రకటించారు. పిసిసి అధ్యక్షులు ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు లేకుండా పోలవరం ప్రాజెక్టు కట్టడం అన్నివిధాలా ప్రమాదకరమన్నారు. పోలవరం నిధులపై కేంద్రాన్ని సిఎం జగన్ ఎందుకు ప్రశ్నించరని టిడిపి నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు పేరు చెప్పి నిర్వాసితులను గోదావరిలో ముంచేశారని మాజీ ఎంపి పి.మధు విమర్శించారు. అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారంగా ఉండే గిరిపుత్రులను వరదల్లో కొండలు, గుట్టలు ఎక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంటూరు లెక్కల పేరుతో నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడం లేదన్నారు. సభలో రాష్ట్ర మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, ఖమ్మం మాజీ జడ్‌పి ఛైర్మన్ చందా లింగయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జెవి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ రావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- పశుసంవర్ధక కార్యాలయాన్ని ముట్టడించిన డివైఎఫ్ఐ
- అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డివైఎఫ్ఐ, ఎహెచ్ఎ పిలుపునిచ్చిన పశుసంవర్ధక డైరెక్టరు కార్యాలయం ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. డైరెక్టరు కార్యాలయంలోకి వెళ్లాలని ప్రయత్నించిన డివైఎఫ్ఐ, ఎహెచ్ఎ నాయకులను విజయవాడలో సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పశుసంవర్ధకశాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ, ఎహెచ్ఎ సోమవారం కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. వివిధ ప్రాంతాల నుంచి నాయకులు ముందుగా విజయవాడలోని బందర్ రోడ్డుకు చేరుకున్నారు. అక్కడ్నుంచి ప్లకార్డులు, బ్యానర్లతో కార్యాలయం ముట్టడికి బయలుదేరగా మధ్యలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ముందుకు వెళ్లేందుకు నాయకులు ప్రయత్నించగా అక్కడ ఉద్రికత్తత చోటు చేసుకుంది. పోలీసులు బలవంతంగా వారిని అరెస్టు చేసి వ్యాన్‌లో పడేశారు. అనంతరం గవర్నరు పేటకు తరలించారు. అంతకముందు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖలో పోస్టుల భర్తీ కోసం సుమారు 40 వేలమంది నిరుద్యోగులు మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారని అన్నారు. వేలకు వేలు చెల్లించి శిక్షణ కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. 3-5 రైతు భరోసా కేంద్రాలను కలిపి ఒక పోస్టుకు అధికారులు అనాలోచితంగా ఉత్తర్వులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్లస్టర్ విధానం అమలు చేస్తే ఉన్న ఉద్యోగాలు మిగులుతాయని, ఖాళీ పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉండదన్నారు. ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఫలితం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్లస్టర్ విధానం రద్దు చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో డివైఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, నాయకులు పి కృష్ణ, బాజీబాబు, శివ, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అరెస్టయిన వారిని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.



ఆందోళనకారులను బలవంతంగా అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు



అంబటి ఆంజనేయులు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టు ఉద్యమ నేత అంబటికి అంతిమ వీడ్కోలు

- పలువురు ప్రముఖులు, నేతల నివాళి

ప్రజాశక్తి - విజయవాడ

ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర గౌరవ సలహాదారు అంబటి ఆంజనేయులుకు జర్నలిస్టులు అంతిమ వీడ్కోలు పలికారు. విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూసిన అంబటి ఆంజనేయులు భౌతికకాయాన్ని విజయవాడ దుర్గాపురంలోని ఆయన స్వగృహం వద్ద సందర్శనార్థం ఉంచారు. జర్నలిస్టులు అంబటి ఆంజనేయులు భౌతికకాయాన్ని జర్నలిస్టు సంఘాల నేతలు, పలు పత్రికల సంపాదకులు, సమాచార శాఖ అధికారులు, రాజకీయ పార్టీల నేతలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. భౌతికకాయాన్ని గాంధీనగర్‌లోని విజయవాడ ప్రెస్ క్లబ్‌కు తీసుకువచ్చారు. అనంతరం కృష్ణలంకలోని స్వర్గపురిలో అంత్యక్రియలు నిర్వహించారు.

పలువురు నివాళి

అంబటి ఆంజనేయులు భౌతికకాయానికి పలువురు ఘన నివాళులర్పించారు. రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎంఎల్ఎ మల్లాది విష్ణు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, సెంట్రల్ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ కస్తూరి, అధికార భాషా సంఘం ఛైర్మన్ పి విజయబాబు, జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఐజెయు అధ్యక్ష కార్యదర్శులు కె శ్రీనివాస్‌రెడ్డి, డి సోమసుందర్, ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై అచ్యుతరావు, ఎపియుడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చందు జనార్దన్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకట్రావు, రాష్ట్ర నాయకులు శాంతిశ్రీ, షేక్ ఖాజావలి, ఎపిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెవుల కృష్ణాంజనేయులు, సామ్నా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, రమణరెడ్డి, విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు, న్యూస్ ఎడిటర్ మోదుమూడి మురళీకృష్ణ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రాష్ట్రాన్ని దోచుకుంటున్న సిఎం

- ఆరోగ్య శ్రీని మించిన పాలసీ తీసుకొస్తాం
- నరసాపురం సభలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - నరసాపురంటౌన్, యలమంచిలి



రాష్ట్రాన్ని, సహజ వనరులను సిఎం జగన్, మంత్రులు దోపిడీ చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసిపిని తరిమికొట్టాలన్నారు. వారాహి విజయ యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అప్పులు చేసి రాష్ట్రాన్ని నడుపుతున్న జగన్ సర్కార్ రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టిందని, కేవలం బటన్ నొక్కే కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు కూడా ఒక్కొక్కటిగా తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'కనీస వసతులు అందరికీ అందాలి. అది ప్రాథమిక హక్కు. ప్రాథమిక సౌకర్యాలు లేకుంటే ప్రజలు ఉద్యమం చేస్తారు. ప్రజలు ఎంతో కష్టాలు పడి పన్నులు కడుతుంటే.. వాటిని కొందరు నేతలు దోపిడీ చేస్తున్నారు. రోజులు మారాయి.. మాటలతో మోసం చేయలేమని సిఎం గ్రహించాలి. నేనెప్పుడు గొంతెత్తినా అది అణగారిన వర్గాల కోసమే. రాజకీయాల్లో జవాబుదారీతనం ఉండాలి. 2.5లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఎన్ని ఇచ్చారు? పేద విద్యార్థులకు ప్రభుత్వమే అవకాశాలు కల్పించాలి. అవినీతి పనులు చేసిన వారిని అందలమెక్కించారు. ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతులకు మద్దతు ధర రాలేదు.. మేం వచ్చాక ఆరోగ్యశ్రీని మించిన ఆరోగ్య పాలసీ తీసుకొస్తాం' అని అన్నారు. జనసేన అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తుందని తెలిపారు. పులివెందుల రౌడీయిజానికి ఉభయ గోదావరి జిల్లాలు భయపడే ప్రాంతం కాదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం నెలవారీ జీతాలు కూడా సక్రమంగా ఇవ్వకపోతే వారు ఎట్లా పనిచేస్తారని ప్రశ్నించారు. కేరళ తరహాలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఎందుకు అభివృద్ధి చేయడం లేదని నిలదీశారు. గోదావరి జిల్లాలను దత్తత తీసుకొని 34 నియోజకవర్గాలు వైసిపి విముక్తి ప్రాంతంగా ప్రకటిస్తామని చెప్పారు. కుల మతాల మధ్య ఐక్యత కావాలంటే జనసేన రావాలని ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు.

సిఎస్‌తో బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనరు భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనరు షెల్లీ సాలెహీన్ కలిశారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వీరు భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను షెల్లీ సాలెహీన్ అడిగి తెలుసుకున్నారు.



సిఎస్ జవహర్‌రెడ్డితో భేటీ అయిన బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనరు తదితరులు

పేదలను విద్యకు దూరం చేస్తున్న సంస్కరణలు

- డిగ్రీలో మేజర్ సబ్జెక్టు విధానం రద్దు చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్యలో వస్తున్న మార్పుల వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీ కోర్సులో సింగిల్, మేజర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'డిగ్రీ విద్యారంగంలో మార్పులు ఎవరికోసం' అనే అంశంపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కెఎస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొస్తున్న సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఉన్నత విద్యలో చేస్తున్న సంస్కరణలు వల్ల ప్రభుత్వ కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల డిగ్రీ విధానం విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతుందన్నారు. దేశంలో ఏ యూనివర్సిటీ ఈ విధానాన్ని సిఫార్సు చేయలేదన్నారు. అమెరికాలో చేసిన ప్రయత్నాన్ని అక్కడి విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో రద్దు చేశారని చెప్పారు. ఈ విధానాన్ని దేశంలో బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. విద్యావేత్తలు, మేధావులు, అధ్యాపకుల అభిప్రాయాలను సేకరించకుండా, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను గమనించకుండా, హడావిడిగా, ఏకపక్షంగా నిర్ణయాలను రుద్దుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య పరిరక్షణ కన్వీనర్ రాజగోపాల్, జిసిటిఎ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతూ సింగిల్ మేజర్ సబ్జెక్టులో కనీసం 25 శాతం విద్యార్థులు చేరితేనే ఆ సబ్జెక్టు ఉంటుందనే నిబంధన ఉందని తెలిపారు.

ఇవి ప్రభుత్వ కళాశాలల్లో ఆ సబ్జెక్టులు ఎక్కువగా ఉండవని, తద్వారా కళాశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శులు ఎ అశోక్, శివారెడ్డి, భూషణం, ఎఐఎస్ఎ ఉపాధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ.. డిగ్రీ విద్య లక్ష్యాన్ని, పాఠ్యప్రణాళికను తిరోగమన దిశలో సమూలంగా మార్చివేసే ప్రక్రియ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. అశోక్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోమేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, పిడిఎస్‌యు కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం

మొదటి పేజీ తరువాయి

అడవి బిడ్డలను గోదావరిలో ముంచేస్తున్నాయని అన్నారు. గతేడాది వచ్చిన వరదలకు గిరిజనులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా కొండలపై బతికారని పేర్కొన్నారు. తప్పుడు కాంటూరు లెక్కలను సరిచేయాలని, 41 మీటర్లకు చేరుకోకముందే ముంపునకు గురవుతున్న అన్ని ప్రాంతాలనూ పునరావాస ప్రాంతాలుగా గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ముంపునకు గురైన కుటుంబాలకు రూ.2000 ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. నిత్యావసరాలు కూడా ఇవ్వలేదని, సదుపాయాలూ కల్పించలేదని, ఫలితంగా గిరిజనులు నరకయాతన అనుభవించారని తెలిపారు. సరైన ఆహారం కూడా లేక ఎక్కువమంది మరణించారని, ఆ విషయాన్ని కూడా బయటకు రానీయలేదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పోలవరం ముంపు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర చేపట్టామని, దీనికి బాధితుల నుండి స్పందన వస్తోందని, వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పాదయాత్ర దృష్టికి తీసుకొస్తున్నారని అన్నారు. జులై 4న విజయవాడలో మహా ధర్నాతో ముగుస్తుందని వివరించారు. సమస్యలను విన్న గవర్నరు వాటిని పరిశీలిస్తానని తెలిపారు.





పోలవరం శబరి నది బ్రిడ్జిని దాటుతున్న మహా పాదయాత్ర బృందం

గోదావరి నది దాటుతున్న మహా పాదయాత్ర బృందం

క్లాస్ వార్‌లో

నిర్వాసితుల పక్షమా?... కాంట్రాక్టర్ల పక్షమా?

సిఎం జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలి : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, విఆర్.పురం, కూనవరం

క్లాస్ వార్‌లో నిర్వాసితుల పక్షమో? కాంట్రాక్టర్ల పక్షమో? ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుకేక మహా పాదయాత్ర ఏడో రోజైన సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్.పురం, కూనవరం మండలాల్లో కొనసాగింది. జిల్లాలో యాత్ర పూర్తి చేసుకుని ఏలూరు జిల్లాలోకి ప్రవేశించే ముందు విఆర్.పురం మండలం రేఖపల్లి సెంటర్, రాజీవ్ గాంధీ సెంటర్, ధర్మతాళ్లగూడెం ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో నాయకులు మాట్లాడారు. తన ఇల్లు పూర్తిగా మునిగిపోయిందని, నెల రోజులపాటు మండల కార్యాలయంలో కుటుంబంతో తలదాచుకున్నామని, ఇప్పటికీ ఇంటిని పునర్నిర్మించుకోలేకపోయానని ధర్మతాళ్లగూడేనికి చెందిన వ్యవసాయ కార్మికుడు జల్లి వీరయ్య పాదయాత్ర బృందానికి తన కష్టాన్ని చెప్పుకున్నారు. ప్రభుత్వం కేవలం రూ.10 వేలు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పూరిపాక పునర్నిర్మాణానికి రూ.50 వేలు ఖర్చవుతుందని తెలిపారు. అడవిలో కలప తెచ్చుకునేందుకు వెళ్తే, ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. అనంతరం కూనవరం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు వందలాది మంది పోలవరం నిర్వాసితులు హాజరయ్యారు. పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అధ్యక్షత వహించారు. ఈ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కల్పించకుండా ప్రాజెక్టు నిర్మిస్తుండడంతో విలీన మండలాల్లోని సుమారు 193 గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే నాలుగు మండలాలు పూర్తిగా జల సమాధి కానున్నాయన్నారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని తెలిపారు. ఢిల్లీ, కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. గతేడాది వరదల సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, వరద బాధితులకు సిపిఎం అండగా నిలిచిందని తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీమంతుల వెంకటరమణ తదితరులు సంఘీభావంగా మాట్లాడారు. పోరుకేక మహా పాదయాత్రలో పార్టీలకతీతంగా అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్మారక స్తూపాల వద్ద నివాళులు

పుచ్చలపల్లి సుందరయ్య, బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావు, శ్యామల వెంకటరెడ్డి, పులి రామయ్య, బిఎస్.రామయ్య, మడివి ముకయ్య, మడకం పంతులు, మార్త శ్రీరామ్మూర్తి, బొప్పన భీమయ్య స్మారక స్తూపాలకు పాదయాత్ర బృందం నివాళ్లర్పించి ముందుకు సాగింది. పాదయాత్ర రేఖపల్లిలో బయలుదేరిన కొద్దిసేపటికి టిడిపి నాయకులు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు తరలివచ్చి మద్దతు తెలిపారు. రేఖపల్లి సెంటర్‌లో సంక్షేమ పరిషత్ నాయకులు వేటకాని మల్లయ్య, ఆదివాసీ సమితి నాయకులు పూనం వీరభద్రం, పాయం రవివర్మ, మానే నాగేశ్వరరావు, శబరి వంతెన వద్ద జనసేన పార్టీ కూనవరం మండల అధ్యక్షులు సాంబశివ, విఆర్.పురం మండల అధ్యక్షులు సాయికృష్ణ, కూనవరం సర్పంచ్ హేమంత్, యుటిఎఫ్ జిల్లా నాయకులు పి.కన్నారావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, కూనవరం బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీమంతుల వెంకటరమణ సంఘీభావం తెలిపి పాదయాత్ర వెంట నడిచారు. మహా పాదయాత్రకు ఎక్కడికక్కడ జనం ఎదురేగి ఘన స్వాగతం పలికారు.

పాదయాత్రలో పాల్గొంటూ... పాఠాలు చెబుతూ..

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అంకితభావం

ప్రజాశక్తి- విఆర్.పురం, కూనవరం (అల్లూరి జిల్లా)

నిత్యం ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై పాలకులను నిలదీసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. విఆర్.పురం మండలంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితులకు అండగా చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రకు సంఘీభావం తెలిపి రెండు రోజులుగా పాదయాత్రలో ఆయన భాగస్వాములవుతున్నారు. ఈ క్రమంలోనే విఆర్.పురం మండలం రేఖపల్లిలో పాదయాత్ర ప్రారంభానికి ముందు సమీపంలోని కస్తూర్బా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సోషల్ సబ్జెక్టులో ఓ పాఠాన్ని విద్యార్థులకు బోధించారు. ప్రజా జీవితంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల అంకితభావాన్ని మరోసారి చాటి చెప్పారు.



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ఏలూరు జిల్లాలోకి మహా పాదయాత్ర

ఎక్కడికక్కడ ఘన స్వాగతం



కూనవరం బస్ స్టాండ్ సెంటర్లో జరిగిన సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యలపై చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం నుంచి గోదావరి నదిని దాటుకుని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రమ్మకోటకు చేరుకుంది. ఈ గ్రామంలోకి ప్రవేశించిన పాదయాత్ర బృందానికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు ఘన స్వాగతం పలికారు. పాదయాత్రకు నేతృత్వం వహిస్తోన్న వి.శ్రీనివాసరావుకు పూలదండలు వేసి బొట్టు పెట్టి స్వాగతం పలికారు. జిల్లాలో ప్రవేశిస్తున్న పాదయాత్రకు మద్దతుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి తరలివచ్చారు. పాదయాత్ర బృందంతో గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు నడిచారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో వేలేరుపాడు నాయకులు పాదయాత్రకు స్వాగతం పలికారు.

టిడిపి, జనసేన పార్టీల సంఘీభావం

పాదయాత్ర బృందం రుద్రమకోట గ్రామంలోకి ప్రవేశించగానే టిడిపి మండలాధ్యక్షులు అమరవరపు అశోక్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేష్ ఆదినారాయణ తమ నాయకులు, కార్యకర్తలతో ఎదురేగి వి.శ్రీనివాసరావుకు, పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. సిపిఎం పోరాట పటిమకు అభినందనలు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో టిడిపి మాజీ జడ్‌పిటిసి సభ్యులు సంజీవరావు తదితరులు ఉన్నారు.

పోలవరం ముంపుపై కాకి లెక్కలు

ముంపు మండలాల్లో సంక్షేమం, అభివృద్ధి శూన్యం : వి శ్రీనివాసరావు

పోలవరం ముంపు లెక్కలన్నీ కాకి లెక్కలని, ఇక్కడి ప్రజలను దగా చేసి నిలువునా ముంచేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రుద్రమ్మకోట గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 17 ఏళ్ల తర్వాత కూడా ముంపుపై స్పష్టత లేదన్నారు. కూనవరం, విఆర్‌పురం వంటి గ్రామాలను 2001లో నోటిఫికేషన్‌లో చేర్చారని, ఇప్పుడు ఈ గ్రామాల పేర్లు లేవంటున్నారని తెలిపారు. మనుగడలోలేని ఊరి పేర్లు జాబితాలో ఉన్నాయన్నారు. ముంపు గ్రామాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమన్నారు. పరిహారం అందకుండా పోలవరం నిర్వాసితులు గ్రామాలను విడిచి ఎందుకు వెళ్లాలని ప్రశ్నించారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, పిల్లల చదువులు ఆగిపోయాయని తెలిపారు. తాడోపేడో తేల్చుకునేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధమయ్యారని, అందుకే పాదయాత్రకు పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోందన్నారు. టిడిపి, జనసేనతోపాటు వైసిపి నాయకులు కూడా మద్దతు పలుకుతున్నారని తెలిపారు.

ముంపులో ఉన్నా పట్టించుకోవడం లేదు

మా గ్రామం వరద ముంపునకు గురవుతోంది. 41.15 కాంటూరులో చేర్చాల్సి ఉన్నప్పటికీ 45.72 కాంటూరులో పెట్టారు. కలెక్టర్ కార్యాలయం చుట్టూ, ఐటిడిఎ చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. 18 ఏళ్లు నిండిన యువత గ్రామంలో 20 మంది ఉన్నారు. మా సమస్యను పాదయాత్ర బృందానికి చెప్పుకునేందుకు వచ్చాం.

-కొండలరావు, తాట్కూరుగొమ్ము కాలనీ, వేలేరుపాడు మండలం

ప్రకటించిన భూ పరిహారం ఇవ్వలేదు

ప్రభుత్వం 2006కు ముందు 15 ఎకరాలు తీసుకుంది. అప్పట్లో ఎకరాకు రూ.1.15 లక్షల చొప్పున ఇచ్చారు. ఆ భూములకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని జగన్ ప్రకటించారు. ఇప్పటికీ ఈ పరిహారం ఇవ్వలేదు. మా గ్రామంలో 75 కుటుంబాలు ఉన్నాయి. న్యాయం కోసం పోరాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముంపులో ఉన్నప్పటికీ 45.72 కాంటూరులో చేర్చారు. మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

-నంబూరి వెంకటేశ్వరరావు, తాట్కూరుగొమ్ముకాలనీ ఎ బ్లాక్, వేలేరుపాడు మండలం

'పోలవరం'పై శ్వేతపత్రం

- ప్రాజెక్టు నిర్మాణ నాణ్యతపై నిపుణులతో విచారణ చేపట్టాలి
- వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, విఆర్.పురం, కూనవరం

'పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన పునరావాసం కేవలం 11 శాతం మాత్రమే పూర్తయింది. కానీ, 75 శాతం పూర్తి చేశామని చెప్పడం సరికాదు. ప్రతి ఊరిలో గ్రామసభ నిర్వహించి పునరావాసం, పరిహారంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పాదయాత్రలో భాగంగా సోమవారం ఆయన విఆర్.పురం మండలం రేఖపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోరుకేక మహా పాదయాత్ర ఏడో రోజుకు చేరుకుందని, ఎటపాక, కూనవరం, విఆర్.పురం, చింతూరు మండలాల్లో ఈ యాత్ర సాగిందని తెలిపారు. పాదయాత్రకు ఊర్లకు ఊర్లు కదిలి వస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలతో కాలయాపన చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన పునరావాసాన్ని గాలికొదిలేశాయన్నారు. పోలవరం నిర్మాణంలో నాణ్యతా లోపాలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. డయాఫ్రం వాల్ కూలిపోవడం, గైడ్ బండ్ కుంగిపోవడం, కాఫర్ డ్యాంకు బీటలు వారడం వంటివి ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ వైఫల్యాలకు కారణమైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. వరుస పరిణామాలతో అసలు డిజైన్‌లోనే లోపాలు ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే ప్రపంచ స్థాయి నిపుణులతో విచారణ చేయించి, నిర్ధారణ చేసిన తర్వాతే నిర్మాణం కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతపై కేంద్ర ప్రభుత్వం మాట మార్చిందన్నారు. విభజన హామీలను అమలు చేయలేదని తెలిపారు. అయినా, మోడీ సర్కారుకే భజన చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రమా? రావణ కాష్టమా?

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ ఇది రాష్ట్రమా? రావణ కాష్టమా? అంటూ టిడిపి అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. రేపల్లెలో విద్యార్థి సజీవ దహనం, ఏలూరులో మహిళపై యాసిడ్ దాడి ఘటనలపై సోమవారం విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రస్తావించారు. మచిలీపట్నం, నెల్లూరులో జరిగిన అత్యాచారాల ఘటనలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రిగా ఉండి కూడా ఒక్క ఘటనపైనా జగన్ సీరియస్‌గా స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు. జగన్ ప్రజల బిడ్డ కాదని, ప్రజల ప్రాణాలకు వెలకట్టే పెత్తందారు అని అన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎపి పబ్లిక్ సెక్టార్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులనూ రెగ్యులరైజ్ చేయాలని ఎపి పబ్లిక్ సెక్టార్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ ఆదినారాయణ, ఎస్ నూర్‌మహ్మద్, కోశాధికారి ఎన్ భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీలు, స్థానిక సంస్థలు, సొసైటీలు వంటి ప్రభుత్వ రంగ సంస్థల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐదేళ్ల సర్వీసు నిబంధనను సడలించి 2014 జూన్ 2 నాటికి వున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, టైమ్ స్కేల్, కంటింజెంట్, పార్ట్‌టైమ్, గెస్ట్ తదితర ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలని కోరారు. అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్, గెస్ట్ తదితర ఉద్యోగులను డైరెక్ట్ కాంట్రాక్టు పద్ధతిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

58,541 ఇళ్లు ఉపసంహరణ

- కేంద్రం చర్యలతో లబ్ధిదారులకు అన్యాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అనేక రాష్ట్రాలకు కేటాయిస్తున్న పథకాల్లో అనునిత్యం కోతలు విధించే కేంద్ర సర్కారు తాజాగా ఇళ్ల కేటాయింపుల్లోనూ అదే కోతల విధానాన్ని అనుసరిస్తోంది. ఇలా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఇళ్లలో 58,541 ఇళ్లను కేంద్రం ఉపసంహరించుకుంది. ఈ చర్యలతో లబ్ధిదారులకు అన్యాయం చేసినట్లు అయ్యింది. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో కూడా ఇదే తరహా కేంద్ర విధానం అధికారుల లేఖ ద్వారా వెలుగులోకి వచ్చింది. అప్పట్లో రాష్ట్రానికి 2016-17 నుంచి వరుస మూడేళ్లలో 1,70,912 ఇళ్లను గ్రామీణ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేటాయించారు. వీటిల్లో ఏకంగా 1,03,387 ఇళ్లు రద్దయ్యాయి. ఇందులో కొన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేంద్రానికి వాపసు ఇవ్వగా, మరికొన్ని నేరుగా కేంద్రం ఉపసంహరించుకుంది. ప్రధానంగా పర్మినెంట్ వెయిట్ లిస్ట్ (పిడబ్ల్యు), సోషియో ఎకనామిక్ కాస్ట్ సెన్సస్ (ఎస్ఇసిసి) అమలులో ఇబ్బందులు కారణంగా ఇళ్లను రద్దు చేసినట్లు కేంద్రం చెబుతోంది. కేటాయించిన ఇళ్ల నిర్మాణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకుంటాయి. అయితే ఈ కారణాలను చూపిస్తూ ఏకంగా 58,541 ఇళ్లను కేంద్రం వెనక్కు తీసుకుంది. ఇక ఈ మొత్తం ఇళ్లలోనే మరో 44,846 ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వమే వెనక్కు ఇచ్చేసింది. దీనివెనుక కూడా కుల సమీకరణలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు అప్పట్లో పనిచేసిన అధికారులు వ్యాఖ్యానించడం గమనార్హం. ఇలా కొన్ని రద్దు, కొన్ని సరెండర్ చేయడం ద్వారా మిగిలిన 67,525 ఇళ్లను మాత్రమే రాష్ట్రంలో ప్రారంభించగలిగారు.

ఈ ఇళ్లకు సంబంధించి కేంద్రం నుంచి రూ.719 కోట్లు రాగా, రాష్ట్రం మరో రూ.479 వెచ్చించి ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తంలో రూ.621 కోట్లు మాత్రమే వ్యయం చేయగా, మిగిలిన సొమ్మును అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణ ఖాతాలో ప్రారంభ నిల్వగానే చూపిస్తున్నారు. అలాగే ఆనాటి ఇళ్ల నిర్మాణాలకు వినియోగ ధ్రువీకరణ పత్రాలు రాలేదని చెబుతున్న కేంద్రం మరికొన్ని కారణాలను కూడా చూపిస్తూ తరువాత సంవత్సరాలకు నిధుల విడుదల్లో జాప్యం చేస్తోంది. ఈ కారణంగానే ఆవాస యోజన ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రం నుంచి ఇంకా రూ.659 కోట్లు రావాల్సి ఉందని, ఆ నిధులు త్వరగా విడుదల చేయాలని రాష్ట్రం నుంచి కేంద్రానికి లేఖలు వెళ్లాయి.

'పర్స' శతజయంతి సందర్భంగా రక్తదానం

- 23 యూనిట్లు సేకరణ : డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కార్మిక ఉద్యమ నిర్మాత పర్స సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 23 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ మాట్లాడుతూ..రక్తదానం చేసిన వ్యక్తిలో కొత్త రక్త కణాలు ఉత్పత్తి అయి ఇమ్యూనిటీ పెరుగుతుందని తెలిపారు. యువత ముందుకొచ్చి రక్తదానం చేసి సమాజ మనుగడకు కృషి చేయాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్ర శేఖర్, ఎ.రామాంజులు మాట్లాడుతూ.. కార్మిక, కర్షకుల హక్కులు, చట్టాల కోసమేగాక ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

సంపాదకీయం

శుభారంభం !

దేశానికి పీడగా తయారైన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే ఏకైక లక్ష్యంతో బీహార్ రాజధాని పాట్నాలో శుక్రవారం జరిగిన ప్రతిపక్ష పార్టీల భేటీ ముందడుగు. విభిన్న సిద్ధాంతాలు, వైఖరులు కలిగిన పదిహేను జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఒకే వేదిక మీదికి రావడం ఒక విజయంకాగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిరంకుశ బిజెపిని ఓడించేందుకు ఐక్యంగా పని చేయాలన్న ఏకాభిప్రాయానికి రావడం అతి పెద్ద విజయం. బిజెపి ఓటమే లక్ష్యంగా సమావేశమైన విపక్షాల విస్తృత సమావేశం ఫలప్రదం కావడం బిజెపి పాలనలో వేళ్లూనుకుంటున్న ఫాసిస్టు తరహా రాజకీయాలపై ప్రతిఘటనకు శుభారంభం. కొనసాగింపుగా వచ్చే నెలలోనే హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో విపక్షాల రెండవ భేటీ ఉంటుందని ప్రకటించడమే కాకుండా తమ ఉమ్మడి లక్ష్య సాధన కోసం ఉమ్మడి ఎజెండా ఖరారు చేస్తామని, రాష్ట్రాలవారీగా ప్రత్యేక ప్రణాళికల రూపకల్పనకు నిర్దిష్ట నిర్ణయాలు చేస్తామని పాట్నా సమావేశానంతరం విపక్ష నేతల వక్కాణింపు ఆహ్వానించదగినది. ఈ పరిణామంతో ప్రజాస్వామ్య, లౌకిక, రాజ్యాంగ ప్రేమికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

భిన్న ధృవాలుగా వ్యవహరించే పార్టీలు తమ వైఖరులను పక్కనపెట్టి తక్షణ కర్తవ్యంగా బిజెపిని ఓడించేందుకు కలిసికట్టుగా ముందుకు రావడానికి బిజెపియే కారణం. ఆ పార్టీ కేంద్రంలో అధికారంలోకొచ్చింది మొదలు తొమ్మిదేళ్లలో ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకత్వంలో ఫాసిస్టు హిందూత్వ దేశంగా మార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. భారత లౌకిక, ప్రజాస్వామ్య నిర్మాణాన్ని నాశనం చేస్తోంది. సమాఖ్య సూత్రాలు, లౌకికవాదం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ స్తంభాలపై దాడి తీవ్రతరం చేసింది. మరోవైపు దేశాన్ని కార్పొరేట్లపరం చేసేందుకు ఏ చర్యకైనా వెనుకాడట్లేదు. అంతేకాదు, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపర్చేందుకు సిబిఐ, ఇడి, ఐటి వంటి సంస్థలను ప్రయోగిస్తోంది. గవర్నర్లను ఏజెంట్లుగా చేసుకొని ఎన్నికైన ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతోంది. దాంతో బిజెపిని వ్యతిరేకించే పార్టీలతో పాటు గతంలో ఆ పార్టీకి మద్దతిచ్చిన పార్టీలూ తమ కుర్చీ కిందికి ఎప్పుడు నీళ్లొస్తాయోనని భయపడి క్రమేణ బిజెపికి దూరం జరుగుతున్నాయి. బిజెపిని ఓడించకపోతే తమకు మనుగడ లేదన్న నిర్ణయానికొచ్చాయి. ఆ ఫలితమే విపక్షాల ఐక్యతకు నాందీవాచకమైంది. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలన్న లక్ష్యం ముందు తమలో ఉన్న విభేదాలు, ధోరణులు అడ్డుకాబోవని స్పష్టీకరిస్తున్నాయి. ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో కాంగ్రెస్, ఆప్ మధ్య ఉన్న విభేదాలు తొలగించుకునేందుకు ప్రయత్నిస్తామని రాహుల్‌గాంధీ చెప్పినా, కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తామని మమతా బెనర్జీ అన్నా, కాంగ్రెస్ తమకు శత్రువు కాదని అఖిలేష్ యాదవ్ ఉద్ఘాటించినా, తమకు జాతి సమగ్రతే ముఖ్యమని ఉద్ధవ్ ఉటంకించినా, బిజెపిని ప్రతిఘటించాలన్న లక్ష్యం ప్రస్ఫుటిస్తుంది. కాగా బిజెడి, వైసిపి, టిడిపి ఇంకా కళ్లు తెరవట్లేదు. కాంగ్రెస్, బిజెపిని ఒకే గాటన కట్టిన బిఆర్‌ఎస్ వైఖరి గందరగోళంగా ఉంది. బిఎస్‌పి ధోరణి షరా మామూలే.

రాష్ట్రాల పరిస్థితులకనుగుణంగా బిజెపిని ఓడించే ప్రణాళికలు ఉండాలన్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సూచన ఆచరించదగిన మేలిమి మార్గం. రాష్ట్రాల్లో బిజెపి వ్యతిరేక ఓటు చీలకుండా నివారించడం ప్రధానం. జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లి పోరు పిల్లి పోరు పిట్ట తీర్చిన చందాన బిజెపి లాభపడుతుంది. గత ఎన్నికల్లో 37.36 శాతం ఓట్లు తెచ్చుకున్న బిజెపి 303 సీట్లతో అధికారంలోకి రాగలిగింది. వాస్తవానికి దేశ వ్యాప్తంగా బిజెపిని 60 శాతంపైన ఓటర్లు తిరస్కరించారు. ఈ పరిస్థితి ప్రతిపక్షాల అనైక్యత వల్లనే ఎదురైంది. ఇటువంటి స్థితి పునరావృతం కాకుండా ఉండాలంటే బిజెపి వ్యతిరేక ఓటు చీలకుండా చూసుకోవడం ప్రతిపక్షాల సమిష్టి బాధ్యతగా ఉండాలి. రాబోయే సమావేశాల్లో విపక్షాల ఉమ్మడి కార్యాచరణ, ఎజెండా ఆ దిశలో ఉండాలన్న ఆకాంక్ష లౌకిక, ప్రజాస్వామ్య వాదుల్లో ప్రబలంగా వ్యక్తమవుతోంది. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రతిపక్షాలు నడుచుకోవాలి.

మహనీయుల మాట



మనం చీకట్లో వున్నామనే
భావన కలిగినప్పుడు
వెలుతురు వైపు చూసే
ప్రయత్నం చేయాలి.
- అరిస్టాటిల్

డాలర్ పెత్తనం - పర్యవసానాలు

ప్రజాస్వామ్యం



ప్రభాత్ పట్నాయక్

అంతర్జాతీయంగా రిజర్వు కరెన్సీగా డాలర్‌కి ఉన్న హోదాకి, సామ్రాజ్యవాదానికి ఉన్న సంబంధం ఏమిటి? ఈ ప్రశ్నలో రెండు భాగాలు ఉన్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదానికి డాలర్‌కి ఉన్న హోదాకి సంబంధం ఏమిటన్నది మొదటి భాగం అయితే, డాలర్ హోదాకి, మొత్తం సామ్రాజ్యవాద ఆధిపత్య వ్యవస్థకి ఉన్న సంబంధం ఏమిటన్నది రెండో భాగం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సంపదను దాచుకోడానికి డాలర్ ఒక మాధ్యమంగా ఉపయోగపడుతోంది. దానికి కారణం అంతర్జాతీయంగా ఏ దేశంలోనైనా డాలర్‌ను రిజర్వు కరెన్సీగా గుర్తిస్తారు. చరిత్రలో గతంలో ఇటువంటి హోదా బంగారానికి, కొంతవరకు వెండికి చాలా కాలం పాటు ఉండేది. బంగారంతో పోల్చితే స్థిరంగా తమ విలువను నిలబెట్టుకోగలిగిన కొన్ని కరెన్సీలు (అంటే ఆ కరెన్సీలో బంగారం ధర పెరగకుండా స్థిరంగా ఉంటుందన్నమాట) రిజర్వు కరెన్సీ పాత్ర కొంతకాలం పోషించగలిగాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కూడా బ్రెటన్‌వుడ్ వ్యవస్థలో (ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ ఆధిపత్యం ఉన్న వ్యవస్థ) ఇదే పరిస్థితి కొంతకాలం కొనసాగింది. ఐతే అధికారికంగా ప్రస్తుతం డాలర్ విలువ బంగారంతో పోల్చితే అంత స్థిరంగా లేదు. కాని ప్రపంచం లోని సంపన్నులంతా ఇప్పుడు కూడా బంగారం మీద ఎంత నమ్మకాన్ని ఉంచుతారో, డాలర్ మీద కూడా అదే నమ్మకంతో ఉంటారు.


డాలర్‌తో పోల్చితే తక్కిన దేశాల కరెన్సీల విలువలు (మన రూపాయి ఒక ఉదాహరణ) పడిపోతూ వుంటాయి. కాని డాలర్ విలువ ఆ మాదిరిగా పడిపోదు. ఎందువల్ల? డాలర్ విలువ కొద్దిపాటి ఎగుడు దిగుడులకు లోనవుతుంది. కాని మొత్తంగా చూసినప్పుడు పడిపోదు. దానికి కారణం అమెరికాలో వేతనాల స్థాయి పెరగకుండా ఎప్పటికప్పుడు కిందకి తొక్కిపట్టి ఉంచుతారు. ఆ విధంగా ఉంచడానికి కావలసిన మేరకు అక్కడ నిరుద్యోగ సైన్యం తగు మోతాదులో ఉండేలా చూస్తారు. అదే విధంగా మన దేశమూ చేస్తుంది కదా? మరి మన రూపాయి విలువ మాత్రం డాలర్‌తో పోల్చితే ఎందుకు పడిపోతోంది? అమెరికా మూడో ప్రపంచ దేశాల మీద ఐఎంఎఫ్ షరతుల పేరుతోనో, రాజకీయంగా వత్తిడులు తీసుకువచ్చో ఆ దేశాలలో పండించే పంటల ధరలను, ఇతర సహజ వనరుల ధరలను తగ్గించేలా చేస్తుంది. దాని ఫలితంగా డాలర్ విలువ పడిపోకుండా నిలబడుతుంది. కాని ఆ మూడో ప్రపంచ దేశాల కరెన్సీల విలువలు డాలర్‌తో పోల్చితే పడిపోతూ వుంటాయి.

ఈ విధంగా డాలర్‌ను దాదాపు బంగారంతో సమానంగా ప్రపంచం లోని కుబేరులందరూ పరిగణిస్తున్నప్పుడు అమెరికా ఎప్పటికీ తరగని ఒక బంగారపు గనిమీద ఉన్నట్టే లెక్క. తన కరెన్సీ విలువను తగ్గించకుండానే అమెరికా తన బడ్జెట్ లోటును (డాలర్లను అదనంగా ముద్రించడం ద్వారా) భర్తీ చేసుకోవచ్చు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ప్రపంచ సంపదను కేవలం డాలర్లలోనే దాచుకోరు. యూరో, పౌండ్-స్టెర్లింగ్, యెన్ వంటి కరెన్సీలలోనూ దాచుకుంటారు. దానికి కారణం ఆ కరెన్సీల దేశాలు తమ కరెన్సీ విలువ డాలర్ తో పోల్చితే పడిపోకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటాయి (అవి కూడా సామ్రాజ్యవాద దేశాలే). మొత్తంగా డాలర్‌ను ఒక ప్రమాణంగా ఆ దేశాలు కూడా పరిగణించడంతో అమెరికా తన లోటు బడ్జెట్‌ను ఏ ఇబ్బందీ లేకుండానే భర్తీ చేసుకునే సదుపాయాన్ని పొందింది.

ఐతే, ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. అసలు అమెరికాలో బడ్జెట్‌లో, అంతర్జాతీయ వాణిజ్యంలో లోటు ఎందుకు ఏర్పడుతుంది? మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రను పరిశీలిస్తే, ఏ దేశం అయితే పెట్టుబడిదారీ వ్యవస్థకు నాయకత్వ పాత్ర పోషిస్తుందో, ఆ దేశం తక్కిన పెట్టుబడిదారీ దేశాలకు తన దేశ మార్కెట్‌లో ప్రవేశించడానికి అవకాశం కల్పిస్తుంది. ఆ విధంగా వారి లాభాపేక్షకు వీలు కల్పిస్తుంది. అలా వీలు కల్పించడం ద్వారా తన నాయకత్వ పాత్రను నిలుపుకోగలుగుతుంది. అప్పుడు ఆ యా దేశాలనుండి పెద్ద ఎత్తున వచ్చిపడే సరుకుల కారణంగా నాయకత్వ స్థానంలో ఉండే దేశానికి వాణిజ్య లోటు ఏర్పడుతుంది. బ్రిటన్ పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకుడుగా ఉన్న కాలంలో యూరప్ ఖండంలోని తక్కిన పెట్టుబడిదారీ దేశాలతోను, అమెరికా తోను నడిపే వాణిజ్యంలో ఎప్పుడూ లోటు ఏర్పడుతూనే వుండేది. ఆ లోటును పూడ్చుకోడానికి బ్రిటన్ తన వలసలలో ఉన్న బంగారం నిల్వలను, విదేశీ మారకపు నిల్వలను కొల్లగొట్టింది. పాలనా వ్యయం పేరుతో రకరకాల రూపాలలో ఆ సంపదను కాజేసింది. దానికి తోడు, వలస దేశాలలో ఉన్న స్థానిక పరిశ్రమలను దెబ్బ తీసే విధంగా తన దేశంలోని ఉత్పత్తులను వలస దేశాలలో కుమ్మరించింది. ఇదెంతదాకా పోయిందంటే బ్రిటన్‌కు వాణిజ్యలోటు అంతా భర్తీ అయిపోవడమేగాక, మిగులు కూడా పోగైంది. ఆ మిగులును పెట్టుబడిగా యూరప్ దేశాలకు, తెల్లవారు ఎక్కడెక్కడ ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటూ వచ్చారో, ఆ ప్రాంతాలకు ఎగుమతి చేసింది.

ఇప్పుడు అమెరికా అదే మోతాదులో మూడో ప్రపంచ దేశాల నుండి కొల్లగొట్టడం సాధ్యం కాదు. ఆ యా దేశాలలోని స్థానిక పరిశ్రమలను దెబ్బ తీయడమూ అదే మోతాదులో సాధ్యపడదు. అందుచేత పెద్ద స్థాయిలో వాణిజ్య లోటును కొనసాగించి ఆ లోటును భర్తీ చేయడానికి డాలర్లను అదనంగా ముద్రించడం తన వ్యూహంగా అమలు చేస్తోంది. ఈ వ్యూహం విజయవంతంగా అమలు కావాలంటే పెట్టుబడిదారీ ప్రపంచంలో డాలర్ ఆధిపత్యం కొనసాగడం చాలా కీలకం అవుతుంది. అలా అమెరికా ఆధిపత్యం కొనసాగడం మీద అమెరికా లోపల సాగే ఆర్థిక కార్యకలాపాలు కూడా ఆధారపడి వుంటాయి. మామూలుగా ఏ దేశం అయినా తన దేశీయ డిమాండ్ ను పెంచడానికి ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ఇప్పటి పరిస్థితులలో సాధ్యం కాదు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ విధించే షరతుల వలన తన బడ్జెట్ లోటును పెంచడం గాని, కార్పొరేట్ల మీద అదనపు పన్నులు విధించడం గాని ఒక పరిమితిని దాటి సాధ్యపడదు. కాని అటువంటి పరిమితులు ఏవీ అమెరికా విషయంలో వర్తించవు. డాలర్ ఆధిపత్యమే దీనికి కారణం. డాలర్ దాదాపు బంగారంతో సమానం అని పరిగణించే పరిస్థితి ఉన్నందున అమెరికా నుండి పెట్టుబడులు ఇతర దేశాలకు పెద్ద ఎత్తున తరలిపోయే ప్రమాదం ఉండదు. అందుచేత అమెరికా ఎంత వ్యయం చేస్తుందో దానిని బట్టే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచపు ఆర్థిక కార్యకలాపాలన్నీ సాగుతాయి. దానిని బట్టే ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉపాధి కల్పన ఉంటుంది.

ఒకవేళ డాలర్ అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా లేదు అనుకోండి. అప్పుడు పరిస్థితి ఏవిధంగా ఉంటుంది? తన విదేశీ వాణిజ్య లోటును భర్తీ చేసుకోడానికి అమెరికా డాలర్ విలువను తగ్గించుకోవలసి వస్తుంది. అలా తగ్గించుకోవడం వలన ఫలితం రావాలంటే, దేశంలోని కార్మికుల నిజవేతనాలు పెరగకుండా నియంత్రించాలి. అలా నియంత్రించినప్పుడు కార్మికవర్గం ప్రతిఘటించకుండా వుండాలంటే, వారికి పోటీగా రిజర్వు సైన్యం (అంటే నిరుద్యోగం) బాగా పెరగాలి. ఇంత చేసినా, తక్కిన పెట్టుబడిదారీ దేశాల నుండి వాణిజ్య పోటీని ఎదుర్కోవడం తప్పదు. అంటే, డాలర్ గనుక అంతర్జాతీయ రిజర్వు కరెన్సీగా లేకపోతే అమెరికా పెట్టుబడిదారీ ప్రపంచానికి నాయకత్వ స్థానంలో ఉండడం సాధ్యం కాదు. పైగా తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో పీకలు తెగ్గోసుకునే వాణిజ్య పోటీలో దిగబడవలసి వచ్చేది. పైగా అమెరికాలో నిరుద్యోగం పెరుగుతున్నకొద్దీ పెట్టుబడిదారీ ప్రపంచంలో కొనుగోలుశక్తి పరిమితం అయిపోయి, ఆర్థిక కార్యకాలపాల స్థాయి అంతకంతకూ తగ్గిపోతూ వుంటుంది. ప్రభుత్వాలు అటువంటి స్థితిలో జోక్యం చేసుకోడానికి వీలు లేకుండా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి విధించిన షరతులు ఎటుదిరిగీ ఉండనే వున్నాయి.



ఇప్పుడు డాలర్ ఆధిపత్యం సవాలునెదుర్కుంటోంది. ఆ యా దేశాలు తమ తమ స్వంత కరెన్సీలలోనే ఉభయత్రా అంగీకారంతో వ్యాపారం చేసుకోడానికి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. బ్రిక్స్ దేశాల నడుమ సాగుతున్న వాణిజ్య ఒప్పందాలు అటువంటివే. సంపన్న పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలన్నీ ఈ పద్ధతికే మొగ్గు చూపుతున్నాయి. దీని వలన వెంటనే డాలర్ ఆధిపత్యం దెబ్బతినిపోయే పరిస్థితి లేదు కాని, దాని ఆధిపత్యం బలహీనపడే క్రమం మొదలైందని చెప్పవచ్చు.

దీనిని బట్టి డాలర్ ఆధిపత్యం కొనసాగడం అనేది కేవలం అమెరికాకే గాక, యావత్తు పెట్టుబడిదారీ ప్రపంచానికీ ప్రయోజనకరంగా ఉంటుంది అనేది స్పష్టం అవుతుంది. అదే సమయంలో ఈ ఆధిపత్యం సామ్రాజ్యవాద పెత్తనాన్ని నిలుపుకోడానికి కూడా తోడ్పడుతుంది.

అమెరికన్ డాలర్ అంతర్జాతీయ రిజర్వు కరెన్సీ మాత్రమే కాదు. అంతర్జాతీయంగా చెలామణీలో ఉన్న కరెన్సీ కూడా. వాస్తవానికి ఆ విధంగా అంతర్జాతీయంగా చెలామణీలో లేకపోతే అది అంతర్జాతీయ రిజర్వు కరెన్సీ స్థానాన్ని పొందగలిగేది కాదు. ఇప్పుడు ఒక దేశం మరొక దేశంతో వ్యాపారం చేయాలంటే డాలర్లు కావాలి.

మూడవ ప్రపంచపు ఉష్ణ మండల ప్రాంతాల్లో లభించే ముడిసరుకుగాని, ఆ దేశాల్లో ఉత్పత్తి అయ్యే సరుకుగాని ప్రపంచ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు సరిపడా లేకపోతే, అంటే, దానికి కొరత ఏర్పడితే, అప్పుడు దాని ధర పెరుగుతుంది. ఒకానొక దేశంలో ఆ సరుకు మాత్రమే ప్రధాన ఉత్పత్తిగా ఉంటే అటువంటి దేశంలో ఈ ధర పెరిగినందువలన ఏర్పడే ద్రవ్యోల్బణం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అదే అనేక సరుకులను ఉత్పత్తి చేసే దేశంలో ఈ సరుకు కూడా ఒకటిగా ఉంటే అప్పుడు ఆ దేశంలో ద్రవ్యోల్బణం ప్రభావం సాపేక్షంగా తక్కువగా ఉంటుంది. ముడిసరుకు ఎక్కువగా మూడో ప్రపంచ దేశాలలో ఉత్పత్తి అవుతుంది. సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో దానిని ఉపయోగించి తయారు చేసే సరుకుల విలువ ఎక్కువగా ఉంటుంది. అందుచేత మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అటువంటి ద్రవ్యోల్బణం ఏర్పడే అవకాశం ఉందని భావిస్తే అప్పుడు ద్రవ్య పెట్టుబడి ఆ దేశాల నుండి ముందే బైటకు జారుకుంటుంది. దానివలన నిజంగానే ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. అప్పుడు ఆ దేశపు కరెన్సీ విలువ డాలర్ తో పోల్చితే తగ్గుతుంది. ఆ తగ్గుదలను అరికట్టడానికి ఆ దేశం మీద పొదుపు చర్యలను షరతుగా విధిస్తారు. ఆ చర్యల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది. నిజవేతనాలు కూడా తగ్గుతాయి.


అప్పుడు ఆ మూడో ప్రపంచ దేశాలలో డిమాండ్ తగ్గుతుంది. తాము ఉత్పత్తి చేసే ముడిసరుకును ఆ దేశాలు అనివార్యంగా సామ్రాజ్యవాద దేశాలకు ఎగుమతి చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ద్రవ్యోల్బణం ఏర్పడింది గనుక ఆ ముడిసరుకు ధర డాలర్ లలో లెక్కించినప్పుడు అంతకు ముందు ఉన్న రేటుకే సామ్రాజ్యవాద దేశాలకు లభిస్తుంది. డాలర్ గనుక అంతర్జాతీయ కరెన్సీగా లేకపోతే మూడో ప్రపంచ దేశాలకు వాణిజ్యంలో డాలర్ల అవసరం ఉండదు. అప్పుడు జరిగే అంతర్జాతీయ వ్యాపారంలో ఆ దేశాలు నష్టపోవు. ఆ విధంగా డాలర్ ఆధిపత్యం సామ్రాజ్యవాద దోపిడీకి పునాదిగా వర్తమాన ప్రపంచంలో ఉపయోగపడుతోంది.

ఐతే, ఇప్పుడు డాలర్ ఆధిపత్యం సవాలునెదుర్కుంటోంది. ఆ యా దేశాలు తమ తమ స్వంత కరెన్సీలలోనే ఉభయత్రా అంగీకారంతో వ్యాపారం చేసుకోడానికి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. బ్రిక్స్ దేశాల నడుమ సాగుతున్న వాణిజ్య ఒప్పందాలు అటువంటివే. సంపన్న పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలన్నీ ఈ పద్ధతికే మొగ్గు చూపుతున్నాయి. దీని వలన వెంటనే డాలర్ ఆధిపత్యం దెబ్బతినిపోయే పరిస్థితి లేదు కాని, దాని ఆధిపత్యం బలహీనపడే క్రమం మొదలైందని చెప్పవచ్చు.

(స్వేచ్ఛానుసరణ)

ఎన్నికల నాటి హామీల మాటేమిటి?

విమర్శ



ఐ. వెంకటేశ్వరరావు

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఎన్నికల నాడు ఉద్యోగులకు సంబంధించి అనేక హామీలు ఇచ్చారు. నిజంగానే ఉద్యోగులు నమ్మి ఆయన రాజకీయ ప్రయోజనం నెరవేర్చారు. కానీ వారికి మాత్రం పిసరంత ప్రయోజనం కలగలేదు.

సిపిఎస్ రద్దు

ఈ కాలపు ఉద్యోగుల ప్రధాన సమస్య సిపిఎస్ రద్దు కావటం. ఇతరేతర సమస్యలకంటే ఈ సమస్య పరిష్కారమే జీవన్మరణ సమస్యగా ఉద్యోగులు, సంఘాలు పోరాడుతూ వచ్చాయి. అసలు సమస్యకే ప్రభుత్వం ఎసరు పెట్టింది. నాలుగేళ్ళకు పైగా ఎదురు చూసిన సిపిఎస్ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. జిపిఎస్ పేరుతో మోసమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నో సంఘాలు, ఎన్నెన్నో పోరాటాలు చేసినా నిండా ముంచిందనే అసంతృప్తితో ఉన్నారు. పాత పెన్షన్‌కు మరేదీ ప్రత్యామ్నాయం కాదని పాత పెన్షన్ హామీనే అడుగుతున్నారు. దేశంలో అందరికంటే ముందే హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి "వారం రోజుల్లో సిపిఎస్ రద్దు" హామీ నుండి వెనక్కిపోవడం తగని పని. హామీ ఇచ్చిన నాడు ఓ మాట, అమలుకొచ్చేసరికి భవిష్యత్ తరాలకు భద్రత అని, ప్రభుత్వానికి భారమని, ద్రవ్యోల్బణం అరికట్టడానికని, రాబోయే 20 సంవత్సరాల లెక్కలు ముందే చెప్పి కథలు అల్లుతున్నారు.

ప్రభుత్వం జిపిఎస్ తుది పరిష్కారం అని చెబుతున్నా, ఉద్యోగుల ప్రధానంగా ఉపాధ్యాయ, సిపిఎస్ సంఘాలు దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. సచివాలయ, ఏపిఎన్‌జిఒ నేతలు ఇప్పటికే ఆమోదం, అభినందనలు చెప్పేశారు. మిగిలిన కొందరు ఇప్పటికిదే పరిష్కారం అంటున్నారు. అనేక రాష్ట్రాలు సిపిఎస్ నుండి వెనక్కి వస్తూంటే జగన్ మోహన్ రెడ్డి జిపిఎస్ ఉద్యోగులకు పెద్ద లాభమంటున్నారు. మళ్ళీ ఎన్నికల నాటికైనా సిపిఎస్ సమస్య పరిష్కారం అవుతుందేమో అని ఆశించిన వారికి ఆశాభంగమే మిగిలింది. ప్రభుత్వం ప్రకటించిన జిపిఎస్ మీద పూర్తి స్పష్టత లేదు. అనేక అనుమానాలున్నాయి.

జిపిఎస్ విధానం ప్రభుత్వానికే లాభకరంగా ఉంది. సిపిఎస్‌లో ప్రభుత్వం చెల్లించాల్సిన 10 శాతం ఎన్‌ఎస్‌డిఎల్‌కు చెల్లించలేదు సరికదా ప్రభుత్వం ఈ నిధులను తన అవసరాలకు వాడుకొంది. జిపిఎస్‌లో ప్రభుత్వం 10 శాతం కడుతుందో లేదో స్పష్టత లేదు. ఇతర హామీలు చూస్తే పిఆర్‌సికి సంబంధించి ఐఆర్, ఫిట్‌మెంట్, హెచ్‌ఆర్‌ఎ, ఇతర అలవెన్సులు, పిఆర్‌సి ఆర్థిక లాభం, 12వ పిఆర్‌సి అమలు చేయాల్సిన సందర్భంలో 11వ పిఆర్‌సి అమలు పూర్తికాకపోవడం, వీటిపై ఆర్థిక లాభం ఎప్పుడెప్పుడో చెల్లిస్తామని తేదీలు నిర్ధారించడం గతంలో ఎన్నడూ లేదు. నాలుగేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన డిఎలకూ ఇదే పరిస్థితి.

కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్

ఉద్యోగులకు సంబంధించి మరో ముఖ్యమైన హామీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేస్తామని. వారందరిని ప్రభుత్వంలోకి లాగేస్తామని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచుతామని, కనీస వేతనం అమలు చేస్తామని ఇవన్నీ ముఖ్యమంత్రి గారి హామీలే. మ్యానిఫెస్టోలో మాటలే. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం ఉద్యోగ సంఘాలు సుదీర్ఘ కాలం పోరాడుతూ వచ్చాయి. నాలుగేళ్ళ తర్వాతనైనా వివిధ శాఖలలో 10,117 మందిని రెగ్యులరైజ్ చేస్తామని క్యాబినెట్ నిర్ణయం తీసుకొంది. ఈ మేరకైనా రెగ్యులరైజ్ చేయడం అభినందనీయమే. న్యాయం ఆలస్యంగా జరిగింది. ప్రభుత్వం ఈ నాలుగేళ్ళలో తనపై ఆర్థిక భారం పడకుండా, ఉద్యోగులకు లాభం అందకుండా జాగ్రత్త పడింది. ఈ విషయంలో కూడా ప్రభుత్వం సహజ న్యాయం, సమాన న్యాయం చేయలేదు. జూన్ 2014 తేదీకి ముందు ఐదేళ్ళ అనే ట్విస్ట్, నియామక పద్ధతిపై మెలికలు, సుమారు 25 ఏళ్ళ నుండి పని చేస్తున్న పార్ట్ టైమ్, కంటింజెంట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రస్తావన లేకపోవడం, తక్కువ మందికి న్యాయం, వీరిలో ఎక్కువమందికి ప్రభుత్వం అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఇంకా 30 వేల మంది, ప్రభుత్వ రంగ, ప్రభుత్వ స్కీమ్‌లలో పని చేస్తున్న 30 వేల మంది మా రెగ్యులరైజేషన్ ఎప్పుడని అడుగుతున్నారు.

కావున ఇచ్చిన హామీ మేరకు అన్ని శాఖలలో దశాబ్దాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వ నిర్ణయం అందరికీ సమానంగా వర్తింపజేయకపోవడం అన్యాయం. కాంట్రాక్ట్ ఉద్యోగులలో చాలామందికి మినిమమ్ టైమ్ స్కేలు నాలుగేళ్ళుగా అమలు కాలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతన పెంపుదల జరగలేదు. అంగన్‌వాడీ ఉద్యోగులకు తెలంగాణ కంటే ఎక్కువ జీతం ఇస్తానన్న హామీ వారితో సమానంగా కూడా జీతాలు చెల్లించడం లేదు. అంగన్‌వాడీ, ఆశాలకు మళ్ళీ జీతాల పెంపు...సమస్యలు పరిష్కరించబడలేదు.

విద్యారంగానికి సంబంధించి ఈ ప్రభుత్వం ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఖాళీల భర్తీ చేయలేదు. ఉపాధ్యాయులకు నెలవారీ ప్రమోషన్లకు తిలోదకాలిచ్చి, ఒక్కసారి మాత్రమే ప్రమోషన్లు ఇచ్చింది. ఉపాధ్యాయులకు ప్రమోషన్ స్కేల్ ఇవ్వకుండా రూ.2500 అలవెన్స్ అనే కొత్త పద్ధతి ప్రవేశపెట్టింది. ప్లస్ టూ అమలుకు సంబంధించి కూడా రెగ్యులర్ స్కేల్ వర్తింపజేయడం లేదు. ఉన్న ఉపాధ్యాయుల్నే సర్దుబాటు చేస్తున్నది.

మాట తప్పం. మడప తిప్పం. విశ్వసనీయత గల ప్రభుత్వం



అని పదేపదే చెప్పే ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి ఈ నాలుగేళ్ళలో చెప్పినదంతా రివర్సే. మాకు సంబంధించి మేనిఫెస్టో ఏం అమలు జరిగిందని అడుగుతున్నారు. వీరి సమస్యల పట్ల అసమ్మతి బయటకు రాకుండా అడుగేస్తే అక్రమ అరెస్టులతో నిరసన హక్కుపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తుంది. ఉద్యోగులకు ఈ ప్రభుత్వ కాలంలో అందాల్సిన ఆర్థిక ప్రయోజనం చాలా తెలివిగా రాబోయే కాలానికి, రాబోయే ప్రభుత్వాలపై నెట్టివేసే విధానం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తన పదవీ కాలానికి పూచీ పడాల్సిన చెల్లింపులు భవిష్యత్తులో చెల్లిస్తారని చెప్పే హక్కు, నైతికత ఈ ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. చెల్లింపులకు గ్యారెంటీ ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

పోట్లాడాల్సిన స్థానంలో ఉండాల్సిన సంఘాలు, మాట్లాడాల్సిన స్థానంలో ఉన్న నాయకులు నలుగురు నాలుగు దారుల్లో ఉండడం, నాలుగు రకాలుగా మాట్లాడం ఈ ప్రభుత్వంలో ఉద్యోగులకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. డిఏలు మరిచిపోయాం. పిఆర్‌సిపై ఆశలు పోయాయి. గట్టిగా అడిగితేనే, గట్టిగా నిలబడితేనే, ఐక్యంగా ఉద్యమిస్తేనే ఏమైనా సాధించుకోగలమనేది చరిత్ర పాఠం. లాభపడ్డా, తాత్కాలికంగా నష్టపోయినా ఉద్యమం ఐక్యంగా ముందుకు సాగాలి. లేకుంటే పాలకుల పాచిక పందెంలో గెలుస్తుంది. పోరాట విరమణా? పోరాటం కొనసాగింపా? తేల్చుకోవాలి. వీరులు పోరాడుతూనే వుంటారు.

(వ్యాసకర్త పిడిఎఫ్ ఎమ్మెల్సీ)

బధిరుల జీవితాల్లో వెలుగు రేఖ

నేడు హెలెన్ కెల్లర్ జయంతి

నివాళి

నిత్య జీవితంలో ఎదురయ్యే ఎన్నో అవరోధాలను పట్టుదలతో అధిగమిస్తూ... చీకట్లో సైతం వెలుగులు చూడగలిగే ధైర్యాన్ని, చైతన్యాన్ని అందించిన ధీశాలి హెలెన్ కెల్లర్. 1880 జూన్ 27న అమెరికా లోని టస్కంబియ అనే చిన్న గ్రామంలో హెన్రీ కెల్లర్, కేట్ అడమ్స్ కెల్లర్ దంపతులకు జన్మించింది హెలెన్ కెల్లర్. 19 నెలల వయస్సులోనే తీవ్ర అనారోగ్యం కారణంగా దృష్టిని, వినికిడి శక్తిని కోల్పోయింది. అలెగ్జాండర్ గ్రాహంబెల్ సూచన మేరకు బ్లైండ్ స్కూల్‌లో చేరి చదవడం నేర్చుకుంది. శస్త్ర చికిత్స ద్వారా దృష్టి పొందిన సలీవన్‌ను 1887 మార్చి 3న ఆమెకు ఉపాధ్యాయనిగా నియమించారు. సలీవన్ కృషితో... తాకడం, వాసన ద్వారా అనేక పదాలను నేర్చుకుంది. 1890లో చదవడం, రాయడం నేర్చుకుని 1904లో బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందింది హెలెన్ కెల్లర్. 1902 లోనే "స్టోరీ ఆఫ్ మై లైఫ్" అనే పుస్తకాన్ని ప్రచురించి చరిత్ర సృష్టించింది. ఈ పుస్తకం 50 భాషల్లో ముద్రించబడింది. దీనిని లేడీస్ హోమ్ జర్నల్ అనే పత్రిక సీరియల్‌గా ప్రచురించింది.



చూపు లేకపోయినా, మాట వినికిడి లోపం ఉన్నప్పటికీ ఏమాత్రం భయపడకుండా వికలాంగులకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు, చైతన్యపరచేందుకు 39 దేశాలు పర్యటించింది. అమెరికన్ సోషలిస్ట్ పార్టీలో చేరి వికలాంగులు, మహిళలు, బాలలు, కార్మికవర్గ హక్కులు సంక్షేమంపై అనేక పుస్తకాలు, వ్యాసాలు రాసింది. ఆమె ఉపన్యాసాలతో అనేక మంది స్ఫూర్తి పొందారు. ఆమె రాసిన 12 పుస్తకాలు ప్రపంచంలో అనేక భాషల్లో ముద్రితం అయ్యాయి. వికలాంగులకు సేవ చేయడం కోసం తన వైవాహిక జీవితాన్ని సైతం తిరస్కరించిన గొప్ప యోధురాలు హెలెన్ కెల్లర్. 1924లో 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' సంస్థను స్థాపించి ప్రపంచ దేశాలు పర్యటించి అంధుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలను సేకరించింది. 'మిరాకిల్ కంటిన్యూస్' అనే హాలీవుడ్ సినిమాలో నటించి వచ్చిన నిధులను ఫౌండేషన్లో జమ చేసింది. 1933లో నేషనల్ లైబ్రరీ ఆఫ్ బ్లైండ్ సంస్థకు అధ్యక్షురాలుగా ఎంపికై అనేక పుస్తకాలను బ్రెయిలీ లిపిలో ముద్రించింది. ఆమె రాసిన అనేక పుస్తకాలు అంధులకు, బధిరులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. సలీవన్ తో పాటుగా థామ్సన్, వినయ్ కర్బల్లి (నర్సు) హెలెన్ కెల్లర్‌కు ఉపాధ్యాయులుగా కొనసాగారు. వికలాంగుల హక్కుల కోసం, మహిళలు, బాలలు, సోషలిజం, కమ్యూనిజం కోసం వ్యాసాలు రాయడానికి ఆమెకు సహాయం చేశారు. 1903-1965 వరకు అమెరికా అధ్యక్షులందరికీ...వికలాంగులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై లేఖలు రాసింది. ప్రతి ఒక్క లేఖకు వారందరూ తిరిగి సమాధానం పంపించారంటే ఆమె చేస్తున్న కృషి పట్ల వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనం. హెలెన్ కెల్లర్ 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' అనే డాక్యుమెంటరీకి 1955లో ఆస్కార్ అవార్డు లభించింది. 1964లో అమెరికా అధ్యక్షుడు లిండన్ బి.జాన్సన్...హెలెన్ కెల్లర్‌ను తమ దేశ ముద్దుబిడ్డగా ప్రకటించడమే గాకుండా 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అనే అత్యున్నత పురస్కారాన్ని అందజేశారు. హెలెన్ కెల్లర్ జీవితాంతం చేసిన కృషికి గుర్తింపుగా అనేక దేశాలు ఆమె పేరుతో విద్యాసంస్థలు ఏర్పాటు చేశాయి. 1968 జూన్ 1న మరణించే వరకు కూడా నిరంతరం ఆమె వికలాంగుల సంక్షేమం, హక్కుల కోసం పరితపించారు.

- ఎం. అడివయ్య,
ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షులు,
సెల్ : 94900 98713

మీ రచనలను
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి

- ప్రతిపక్షాల మధ్య బంధం మరింత బలోపేతం కావాలి • సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో ఉద్ఘాటన
- మణిపూర్‌లో శాంతిని నెలకొల్పండి • అమెరికా ముందు మరింతగా సాగిలపడిన మోడీ సర్కార్

న్యూఢిల్లీ : ప్రజాతంత్ర హక్కులు, పౌర స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులకు మన రాజ్యాంగం ప్రసాదించిన హామీలను, మన రిపబ్లిక్ యొక్క లౌకిక, ప్రజాతంత్ర స్వభావాన్ని కాపాడుకునేందుకు ప్రతిపక్షాల మధ్య సహకారం మరింతగా పెంపొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఉద్ఘాటించింది. పార్టీ పొలిట్‌బ్యూరో ఈ నెల 24, 25 తేదీల్లో ఢిల్లీలో సమావేశమై దేశం నేడు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించింది. అనంతరం సోమవారం నాడిక్కడ ఒక ప్రకటన విడుదల చేసింది. పాట్నాలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష పార్టీల భేటీ, మణిపూర్ సంక్షోభం, ప్రధాని మోడీ అమెరికా పర్యటన, ఉమ్మడి పౌర స్మృతి, ప్రజా ధనం లూటీ, రాష్ట్రాలకు ఆహారధాన్యాల సరఫరాలో అడ్డంకులు, స్మార్ట్ మీటర్లు, రెజ్లర్ల నిరసన తదితర అంశాలపై పార్టీ తన వైఖరిని ఈ ప్రకటనలో స్పష్టం చేసింది.



పాట్నా సమావేశం

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఆహ్వానం మేరకు జూన్ 23న పాట్నాలో 15 ప్రతిపక్ష పార్టీలు సమావేశమయ్యాయి. మన రిపబ్లిక్ లౌకిక ప్రజాస్వామ్య స్వభావాన్ని, ప్రజాస్వామ్య హక్కులు, పౌర స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులకు మన రాజ్యాంగం ఇస్తున్న హామీలను పరిరక్షించేందుకు ప్రతిపక్ష పార్టీల మధ్య సహకారం నెలకొనాల్సిన అవసరం వుందని సిపిఎం నొక్కి చెప్పింది.

జాతీయ స్థాయిలో ఆందోళన కలిగించే కీలకాంశాలపై అఖిల భారత స్థాయిలో ప్రతిపక్ష పార్టీలన్నీ సంయుక్తంగా ప్రచారాలు నిర్వహించాలని, వేగంగా క్షీణిస్తున్న ప్రజల జీవనోపాధి అంశాలపై ఉమ్మడిగా నిరసన కార్యాచరణలు చేపట్టాలని సిపిఎం ప్రతిపాదించింది. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాల ఓట్లలో చీలిక నుండి బిజెపి ప్రయోజనాలు పొందే అవకాశాన్ని వీలైనంత వరకు తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రాల స్థాయిలో ప్రతిపక్ష పార్టీల మధ్య చర్చలు మొదలుకావాలి.

మణిపూర్

మే 3న ప్రారంభమై గత ఏడు వారాలుగా అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న జాతుల హింస పట్ల పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తంచేస్తున్నది. పరిస్థితిని అదుపు చేయడంలో డబుల్ ఇంజన్ల బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అక్కడి పరిస్థితులపై కనీసం వ్యాఖ్యానించడానికి కూడా ప్రధాని మోడీ తిరస్కరించారు ! హింస ప్రారంభమైన 26 రోజుల తర్వాత మే 29న కేంద్ర హోం మంత్రి పర్యటించారు. కానీ అక్కడ శాంతి భద్రతల పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులను సమర్ధవంతంగా నియంత్రించలేని, పైగా ఉదాసీనంగా వ్యవహరించిన బీరేన్ సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వాన్ని రద్దు చేసేందుకు మోడీ ప్రభుత్వం తిరస్కరించడంతో కేంద్ర హోం మంత్రి ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశం వల్ల ఎలాంటి ఫలితం లేకపోయింది. తక్షణమే మణిపూర్‌లో హింసను విరమించి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాలని పొలిట్‌బ్యూరో పిలుపిచ్చింది.

ప్రధాని మోడీ అమెరికా పర్యటన

తాజాగా అమెరికాలో ప్రధాని మోడీ జరిపిన అధికార పర్యటనతో, అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా భారత్ మరింతగా సాగిలపడేలా బంధాన్ని ముడివేసుకుంది. సంయుక్తంగా జిఇ-ఎఫ్ 414 జెట్ ఇంజన్లను తయారు చేయడంతో సహా ఈ పర్యటనలో కుదిరిన రక్షణ ఒప్పందాలు, అమెరికా 'ప్రధాన రక్షణ భాగస్వామి'గా భారత్ గతంలో కుదుర్చుకున్న ప్రధాన సైనిక, రక్షణ ఒప్పందాలన్నింటి కన్నా మిన్నగా వున్నాయి.

ప్రపంచ గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని తహతహ లాడుతున్న అమెరికా, చైనాను ఏకాకిని చేసేందుకు భారత్‌ను కీలకమైన వ్యూహాత్మక, సైనిక భాగస్వామిగా చూస్తోంది. మోడీ ప్రభుత్వ నేతృత్వంలో భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజాస్వామ్య క్షీణత వంటి అంశాలను ప్రస్తావించేందుకు బైడెన్ ప్రభుత్వం తిరస్కరించడం విస్తృతంగా విమర్శలకు గురైంది. చివరకు అమెరికా మాజీ అధ్యక్షుడు బారక్ ఒబామా కూడా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్యంపై మోడీ ప్రభుత్వ రికార్డు పట్ల అమెరికా కాంగ్రెస్‌కు చెందిన 75మంది సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ వాటిని ప్రస్తావించారు.

ఉమ్మడి పౌర స్మృతి

ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) అంశంపై లా కమిషన్ మళ్ళీ చర్చలు, సంప్రదింపులు ప్రారంభించింది. గత లా కమిషన్ కూడా ఇదే తరహా ప్రక్రియ చేపట్టి, "ఈ తరుణంలో యుసిసి అవసరం లేదు, వాంఛనీయం కూడా కాదు." అని 2018లో నిర్ధారణకు వచ్చింది. సిపిఎం ఈ వైఖరిని బలపరిచింది.

ఏకరూపతను సమానత్వంతో సమం చేయలేం. అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకు సమాన హక్కులు కావాలని పోరాడడంలో సిపిఎం ఎప్పుడూ ముందుంటుంది. అన్ని కమ్యూనిటీలకు చెందిన స్త్రీ, పురుషుల క్రియాశీలమైన ప్రజాస్వామిక భాగస్వామ్యంతో, వివిధ కమ్యూనిటీలకు వర్తించే వ్యక్తిగత లేదా సాంప్రదాయ చట్టాలను సంస్కరించడం ద్వారా దీన్ని మరింత ముందుకు తీసుకెళ్ళవచ్చు.

ప్రజా ధనం లూటీని చట్టబద్ధం చేయడం

పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించే సామర్ధ్యం వున్నా కూడా చెల్లించడానికి తిరస్కరించే విల్‌ఫుల్ డీఫాల్టర్లు (ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులు) చేసే ప్రజా పొదుపు మొత్తాల దోపిడీని చట్టబద్ధం చేస్తూ ఆర్‌బిఐ తీసుకొచ్చిన సర్క్యులర్‌ను ఉపసంహరించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఇటువంటి ఎగవేతదారులు బ్యాంకులతో రాజీ పరిష్కారం కుదుర్చుకోవడానికి ఆర్‌బిఐ సర్క్యులర్ అనుమతిస్తోంది. అటువంటి వ్యక్తుల ఆస్తులను జప్తు చేసి, వాటి నుండి బ్యాంక్ రుణాలను పూర్తిగా రికవరీ చేయాలి.

కేంద్ర కమిటీ సమావేశం

సిపిఎం కేంద్ర కమిటీ తదుపరి సమావేశం ఆగస్టు 4,5,6 తేదీల్లో న్యూఢిల్లీలో ఉంటుంది.

రాష్ట్రాలకు బియ్యం సరఫరా పునరుద్ధరణ

రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం అమ్మరాదని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)ని మోడీ ప్రభుత్వం ఆదేశించిన తీరు అత్యంత నిరంకుశమైనది, అప్రజాస్వామికమైనది. ఉపశమనం కలిగించేందుకు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బిజెపియేతర ప్రభుత్వాలను అడ్డుకోవడానికే ఈ చర్య ఉద్దేశించబడింది.

ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టు రద్దు

విద్యుత్ వినియోగదారుల కొరకు ముందస్తు బిల్లుల చెల్లింపు ఏర్పాట్లతో తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టును మోడీ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకాన్ని అమలు చేయాలని, తద్వారా విద్యుత్ పంపిణీ బాధ్యత నుండి వైదొలగి, గరిష్ట స్థాయిలో లాభాలు కోసం ప్రైవేటు కార్పొరేట్లకు విద్యుత్ పంపిణీని అప్పగించాలంటూ అనేక రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొచ్చింది. ఈ చర్యలు పేదలపై, రైతులపై భరించలేని భారాన్ని మోపుతాయి. అందువల్ల తక్షణమే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలి.

పశ్చిమ బెంగాల్ పంచాయితీ ఎన్నికలు

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలో జరుగుతున్న పంచాయితీ ఎన్నికల్లో ఎప్పటిలాగే ఆనవాయితీగా పెద్ద ఎత్తున హింసాకాండ, భయోత్పాతం నెలకొన్నాయి. కొనసాగుతున్న ఈ ఎన్నికల్లో ఇప్పటికే 10మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సిపిఎం యువ కార్యకర్త కామ్రేడ్ మన్సూర్ ఆలమ్ కూడా వున్నారు.

ఇటువంటి హింస, భయోత్పాత రాజకీయాలు నెలకొన్నప్పటికీ, ప్రజాస్వామ్యాన్ని ఇలా హత్య చేయడాన్ని పశ్చిమ బెంగాల్ ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ప్రజా పంచాయితీలు పెట్టడానికి ధైర్యంగా ముందుకొస్తున్నారు. గత పంచాయితీ ఎన్నికల్లో కనివినీ ఎరుగని రీతిలో భయోత్పాతం నెలకొనడంతో 34శాతం సీట్లలో ఎలాంటి పోటీ లేకుండా పోయింది. ఈసారి అటువంటి భయాందోళనలను ప్రతిఘటిస్తూ, ఈ ఎన్నికల్లో పోటీ లేకుండా పోయిన సీట్ల సంఖ్య గణనీయంగా దాదాపు మూడింట రెండు వంతులు తగ్గిపోయింది.

అస్సాం పునర్విభజన

2023వ సంవత్సరంలో, 2001 జనాభా లెక్కల ప్రాతిపదికగా కేవలం అస్సాంలోనే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టడాన్ని పొలిట్‌బ్యూరో వ్యతిరేకిస్తోంది. పునర్విభజన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయకుండానే, పాలక బిజెపి రాజకీయ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు గానూ ఎన్నికల కమిషనే ఈ ప్రక్రియను చేపట్టిందన్నది సుస్పష్టం.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సర్వే నుండి వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలు మినహాయింపు

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 నుండి వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను తొలగించడం పట్ల పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గత రౌండ్‌లో వేసిన ప్రశ్నలు లోపభూయిష్టంగా వున్నప్పటికీ, ఈసారి మొత్తంగా వాటిని తొలగించడమనేది తిరోగమన చర్య. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6లో వైకల్యానికి సంబంధించిన ప్రశ్నలను చేర్చాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

రెజ్లర్ల నిరసన

తమపై లైంగిక వేధింపులకు సంబంధించి మహిళా రెజ్లర్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు అందచేసినప్పటికీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపిని మోడీ ప్రభుత్వం, బిజెపి నిస్సిగ్గుగా సమర్ధించుకోవడం చూస్తుంటే తమ మద్దతుదారులను ఎలాగైనా కాపాడుకోవాలనే కృత నిశ్చయం వారి చర్యలో ప్రతిబింబిస్తోంది. బాధితురాలిపై ఒత్తిడి తీసుకొచ్చి, ఆమె తన ప్రకటన ఉపసంహరించుకునేలా చేసేందుకై నిందితుడికి కావాల్సిన సమయం ఇచ్చేందుకు గానూ పోస్కో కింద అభియోగాలు నమోదు చేయడంతో పాటు కేసులో దర్యాప్తులను ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేసే చర్యలన్నీ చేపట్టారు. ఇకపై లైంగిక వేధింపులు ఎదుర్కొనే మైనర్లయిన బాధితులు ఫిర్యాదులు చేసే అన్ని కేసులకు దీనివల్ల తీవ్రమైన పర్యవసానాలు వుంటాయి. నిందితుడైన ఎంపిని ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అరెస్టు చేయాలన్న డిమాండ్‌ను సిపిఎం పునరుద్ఘాటించింది.



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

ఆగస్టు 7న గాంధీ విగ్రహాల ఎదుట ధర్నా

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7న రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సత్తెనపల్లిలో పోలా రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చేసిన నిర్ణయాలను పత్రికలకు సోమవారం ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో మాస్టర్ వీవర్స్ వద్ద సహకార సంఘాల వద్ద నిల్వ ఉన్న చేనేత వస్త్రాలు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ జాతీయ చేనేత దినోత్సవం అయిన ఆగస్టు 7న గాంధీ విగ్రహాల వద్ద ధర్నా చేయాలని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో చేనేతకు నిధులు కేటాయించకుండా ద్రోహం చేశాయని సమావేశం పేర్కొంది. ఇప్పటికైనా పునరాలోచించి రాష్ట్ర ప్రభుత్వం రూ.2000 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయించాలని. చేనేతరంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. చేనేతపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని, నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, నేతన్న నేస్తం పథకం ప్రతి చేనేత కార్మికునికి, షెడ్డు కార్మికులకు ఉపవృత్తుల వారికి వర్తింపజేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు జరపాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నూలు, పట్టు, జరీ ధరలు 2021 నాటి ధరలకు తగ్గించాలని, ఇల్లులేని చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో చేసిన వాగ్దానం ప్రకారం ప్రతి చేనేత కార్మికునికి 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, 45 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన పావలా వడ్డీ యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, రిబేటు డబ్బు వెంటనే విడుదల చేయాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. కట్టా శివ దుర్గారావు డోకుపర్తి రామారావు కవుతరపు వెంకటేశ్వరరావు అనుముల వీరబ్రహ్మం గోరు రాజు పాల్గొన్నారు.

ఒడిశాలో ఘోరం

- రెండు బస్సులు ఢీకొని 12 మంది మృతి

గంజాం (ఒడిశా) : ఒడిశాలో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున రెండు బస్సులు ఢీకొని 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో దిగపహండి పోలీస్ స్టేషన్ పరిధిలో రాయ్‌గఢ్ నుంచి భువనేశ్వర్‌కు వెళుతున్న ఒరిస్సా ఆర్‌టిసి బస్సును, పెళ్లి బృందంతో బర్హంపూర్ నుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెళ్లి బృందం బస్సులోని ఎనిమిదిమంది అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆర్‌టిసి బస్సులోని వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని, క్షతగాత్రులను బర్హంపూర్‌లోని ఎంకెసిజి ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు ఆర్థికసాయం : ఒడిశా సిఎం

ఈ ప్రమాదంపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మరణించిన వారిపై ఆధారపడిన కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.30 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

విఫలమైన తిరుగుబాటులో ఎవరా నలుగురు?

యెవ్‌గెని ప్రిగోజిన్



ప్రైవేట్ పారా మిలటరీ వాగ్నర్ గ్రూపు అధిపతి యెవ్‌గెనీ ప్రిగొజిన్. ఇతగాడు గతంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకడిగా పరిగణించబడేవాడు. ఉక్రెయిన్‌పై దాడిలో వాగ్నర్ గ్రూపు చురుకైన పాత్ర పోషించింది అయితే, గత కొంత కాలంగా పుతిన్ నాయకత్వంతో ప్రిగొజిన్‌కు సంబంధాలు చెడిపోయాయి. రష్యా సైనిక నాయకత్వాన్ని మార్చాలన్నది వాగ్నర్ చీఫ్ ప్రిగొజిన్ ప్రధాన డిమాండ్. ఉక్రెయిన్‌లో పరాజయాలకు రష్యన్ రక్షణ మంత్రే కారణమన్నది ఆయన ఆరోపణ. రష్యా బలగాలు వాగ్నర్ గ్రూపుపై కూడా దాడి చేస్తున్నాయని ఆరోపించాడు. రక్షణ మంత్రి సెర్గి షోయిగుపై విమర్శలు గుప్పించాడు. వాగ్నర్ సైనికులను దేశద్రోహులుగా పుతిన్ అభివర్ణించారు. వారికి శిక్ష తప్పదని హెచ్చరించాడు.. అయితే తిరుగుబాటు ప్రారంభించిన కొద్ది గంటల్లోనే బెలారస్ మధ్యవర్తిత్వంలో రొస్తావ్ నుంచి తన సైనికులను ఉపసంహరించుకుని బెలారస్‌లో ఆశ్రయం పొందారు.

సెర్గి షోయిగు



2012నుండి రష్యా రక్షణమంత్రిగా వున్న షోయిగు ఉక్రెయిన్‌పై సైనిక చర్యకు నాయకత్వం వహిస్తున్న వారిలో ఒకరు. ఉక్రెయిన్‌పై ఏడాది కాలంగా సాగుతున్న యుద్ధంలో ఆయన అనేక యుద్ధ తప్పిదాలకు పాల్పడ్డారన్న విమర్శలున్నాయి. పుతిన్‌కి అత్యంత ముఖ్యుల్లో ఒకరైనప్పటికీ, ఆయన విశ్వాసం ఎంతవరకు పొందుతున్నారనే దానిపై సందేహాలు వున్నాయి. 2014లో క్రిమియా ఆక్రమణలో విజయానికి ఆయనను ఒక కారణంగా చెప్పుకోవచ్చు. కానీ ఉక్రెయిన్‌పై పోరు ప్రారంభమైనప్పటి నుండి ఆయన పేరు ప్రతిష్టలు తగ్గుతూ వస్తున్నాయి. పుతిన్ అనుకున్నట్లుగా ఉక్రెయిన్‌లో పోరు సాగడం లేదన్నది బహిరంగ రహస్యం. అదే పుతిన్ అసంతృప్తికి కారణం. ప్రిగోజిన్‌తో షోయిగు సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. అవసరమైన ఆయుధాలు, తూటాలను అందచేయడంలో రక్షణ శాఖ విఫలమైందనేది ప్రిగోజిన్ ఆరోపణ.

వాలెరి గెరాసిమొవ్



ఈ ఏడాది జనవరిలో ఉక్రెయిన్‌లో సైనిక బలగాల కమాండ్‌ను సెర్గి సురొవికిన్ నుండి గెరాసిమొవ్ తీసుకున్నారు. సిరియాలో రష్యా సైనిక ఆపరేషన్‌కు ఇంచార్జిగా వ్యవహరించింది ఈయనే. . 2012లో షోయిగును రక్షణ మంత్రిగా ప్రకటించినపుడు ఆయనకు అత్యంత విశ్వాసపాత్రుడిగా గెరాసిమొవ్ మొదటి డిప్యూటీగా చేశారు. షోయిగు, గెరాసిమొవ్ ఇద్దరిపైనా వాగ్నర్ అధిపతి ప్రిగోజిన్ కత్తులు దూశాడు. ఉక్రెయిన్‌లో భారీ నష్టాలకు వారిద్దరే కారణమని నిందించాడు.

సెర్గి సురొవికిన్



ఇప్పటివరకు రష్యా సాయుధ బలగాల జనరల్ స్టాఫ్ డిప్యూటీ చీఫ్‌గా వున్న సురొవికిన్ ప్రిగొజెన్‌కు మిత్రుడిగా భావిస్తారు. గెరాసిమొవ్‌కు ముందు ఆయనే జనరల్ కమాండర్‌గా వుండేవాడు. ఉక్రెయిన్‌తో ఘర్షణ మొదలైనప్పటి నుండి, వాగ్నర్ చీఫ్‌కు వ్యతిరేకంగా మారినట్లు అగుపిస్తోంది. సురొవికిన్ ఈ అధికార పోరాటం ఆపాలంటూ శుక్రవారం సాయంత్రం ప్రిగొజెన్‌కు విజ్ఞప్తి చేశారు. మన అంతర్గత, రాజకీయ పరిస్థితులను మరింత తీవ్రతరం చేసేందుకు శత్రువు వేచి చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. అంతిమంగా పుతిన్ నాయకత్వాన్ని ఆమోదించాలని కోరాడు.

దళితులపై దమనకాండను అరికట్టాలి

- జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టరుకు టిడిపి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నాలుగేళ్ల నుంచి దళితులపై జరుగుతున్న దమనకాండపై చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్‌సి కమిషన్‌ను టిడిపి కోరింది. హైదరాబాద్‌లోని కమిషన్ ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టరు సునీల్ బాబును టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులు అట్టడుగు స్థాయికి చేరుకున్నారని తెలిపారు. సిఎం దళిత ద్రోహిగా మారారని పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై డిజిపితో సమీక్ష నిర్వహించాలని కోరారు. ఈ అంశంపై డిజిపికి లేఖ రాస్తామని డైరెక్టరు సునీల్ బాబు రాజుతో చెప్పారు. పులివెందులలో మృతిచెందిన జంద్యాల కృష్ణయ్య కుటుంబానికి ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద వచ్చే పరిహారాన్ని కలెక్టరు ద్వారా త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు.

విశాఖపట్నం అధికార పార్టీ ఎంపి కుటుంబ సభ్యులు కిడ్నాప్ వెనుక పెద్దకుట్ర దాగి ఉందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఎంపి కుటుంబ సభ్యుల కిడ్నాప్‌పై కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఎందుకు స్పందించలేదని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. కిడ్నాప్ కుట్ర బయటకు రావాలంటే సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విశాఖలో భూకబ్జా సింహాల మధ్య జరుగుతున్న లావాదేవీలే ఈ కిడ్నాప్‌కు ప్రధానాంశమని ఆరోపించారు.

2022-23లో రాష్ట్రాలు మూలధన వ్యయానికి ఎంత ఖర్చు చేశాయో బ్యాంక్ ఆఫ్ బరోడా తన నివేదికలో వెల్లడించిందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. 23 శాతం ఖర్చుతో రాష్ట్రం 25వ స్థానంలో నిలిచిందని ఆయన విమర్శించారు.

ముస్లిం యువకుడి దారుణ హత్య

- గోగూండాల ఘాతుకం

ముంబై : పశువుల మాంసాన్ని తరలిస్తున్నారనే అనుమానంతో ఓ ముస్లిమును దారుణంగా హత్య చేసిన గోగూండాల ఉదంతమిది. శనివారం రాత్రి మహారాష్ట్ర నాసిక్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముంబైలోని కుర్లాకు చెందిన అఫాన్ అన్సారీ (32), అతని సన్నిహితుడు నాసిర్ షేక్ కారులో పశువుల మాంసాన్ని తరలిస్తున్నారనే అనుమానంతో గోసంరక్షక బృందం వారిని వెంబడించింది. నాసిక్ జిల్లాలో ఆ కారుని అడ్డగించి, వారిద్దరినీ చితకబాదారు. దీంతో, వారు తీవ్ర గాయాల పాలయ్యారు. అన్సారీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ బ్రామే చెప్పారు. నాసిర్‌షేక్ ఫిర్యాదు మేరకు పదిమందిపై హత్య, అల్లర్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పశువుల మాంసం తరలిస్తున్నారా లేదా అన్నది ల్యాబ్ రిపోర్టు తర్వాత తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

లక్షద్వీప్ ఎంపి నివాసంపై ఇడి దాడులు

కొచి : లక్షద్వీప్ ఎంపి మహమ్మద్ ఫైజల్ నివాసం, కార్యాలయాలపై ఇడి అధికారులు ఆదివారం సోదాలు నిర్వహించారు. న్యూఢిల్లీలో ఉన్న ఫైజల్ కార్యాలయంలో కూడా ఇడి అధికారులు దాడులు నిర్వహించారు. ఫైజల్‌తో అనుబంధం ఉన్న ఒక వ్యక్తి నివాసం, కార్యాలయంలో కూడా ఇడి అధికారులు ఆదివారం సోదాలు జరిపారు. మనీలాండరింగ్ చట్టాన్ని ఉల్లంఘించారంటూ ఫైజల్‌పై నమోదైన కేసును ఇడి విచారిస్తుంది.

మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023 ఉపసంహరణ

న్యూఢిల్లీ : ఇటీవల జారీ చేసిన మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్ 2023ను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి) సోమవారం ఉపసంహరించుకుంది. ఎంబిబిఎస్ ప్రవేశాల కోసం ఈ నెల 12న మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్ 2023ను ఎన్‌ఎంసి విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాంపెటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిబిఎంఇ) పాఠ్యాంశాలతో సహా మెడికల్ కాలేజీల్లో పరిశోధన సౌకర్యాలు, మానవ వనరుల నియామకం, వికలాంగుల కేటగిరీ కింద విద్యార్థుల ప్రవేశానికి సంబంధించిన కొత్త నియమాలు ఉన్నాయి. ఈ నిబంధలన్నీ చాలా గందరగోళంగా ఉన్నాయని అనేక విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే వీటిని ఎన్‌ఎంసి ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది.

శరద్యుతి



శరద్యుతి ఐదో తరగతి చదువుతోంది. ఒకరోజు తండ్రితో కలిసి పాఠశాలకు బయలుదేరింది. తండ్రితో కలిసి నడుస్తున్న శరద్యుతి రోడ్డు పక్కన ఏదో చూస్తూ ఆగిపోయింది.

"ఎందుకు ఆగిపోయావు? పాఠశాలకు సమయం అవుతుంది.." అన్నాడు తండ్రి.

"నాన్నా ! అటువైపు చూడు" అన్నది.

రోడ్డు పక్కన కోడి, దాని పిల్లలు కన్పించాయి. అవి చెత్తలో ఆహారాన్ని ముక్కుతో పొడుస్తూ తింటున్నాయి. కోడిని, పిల్లలను ఎప్పుడూ చూడలేదా! అని ప్రశ్నించాడు తండ్రి.

"అది కాదు నాన్నా ! కోడి, దాని పిల్లలు అన్నం అనుకొని, థర్మాకోల్ షీట్ ముక్కలు చేసుకొని తింటున్నాయ"ని చెప్పింది.

తండ్రి ఆ దృశ్యాన్ని పూర్తిగా గమనించలేదు. శరద్యుతి చెప్పిన తర్వాత చూశాడు. నిజమే! ఇప్పుడు ఏం చేద్దాం? స్కూలుకు సమయం అవుతుంది పదా! అన్నాడు.


"అది కాదు నాన్నా ! కోడి గింజలు, పురుగులు తింటాయని మా సైన్స్ టీచర్ చెప్పింది. కానీ తల్లి కోడి తెలియక థర్మాకోలును ఆహారంగా చేసి, పిల్లలకు పెడుతుంది. అది తింటే ఆరోగ్యం పాడవుతుందని వాటికి తెలియదు కదా!" అన్నది.

"అయితే ఏం చేద్దాం!" అన్నాడు తండ్రి.

"నువ్వు తల్లి కోడి, పిల్లలు తింటున్న థర్మాకోలును మెల్లగా తీసెయ్యి. నేను అమ్మ పెట్టిన అన్నం వాటికి వేస్తా.." అన్నది శరద్యుతి.

పాప జాలి గుణానికి తండ్రి ఆశ్చర్యపోయాడు. వెంటనే తల్లి కోడి దగ్గరగా వెళ్లాడు. అది భయంతో పిల్లలను తీసుకుని దూరంగా జరిగింది. వెంటనే థర్మాకోలును తీసేశాడు. శరద్యుతి అమ్మ బాక్సులో పెట్టిన అన్నాన్ని కొంత తల్లి కోడి, పిల్లల ముందు ఉంచింది. తల్లి కోడి దాన్ని ముక్కుతో పొడిచి తింటూ పిల్లల్ని పిలిచింది. ఆ దృశ్యాన్ని చూసిన తండ్రి తాను చేయాల్సిన పనిని తన కూతురు చేసినందుకు మనసులో సంతోషించాడు. తరువాత ఇద్దరూ పాఠశాల వైపు నడక సాగించారు.

- తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర
94923 09100



_at b_x ma_
_ug p_n je_
_eg v_n ha_


ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



- పి. ఇస్తారు,
5వ తరగతి,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
చిల్లకల్లు,
జగ్గయ్యపేట మండలం,
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



అమిత్ కిషన్ ... బ్యాంకు ఉద్యోగాన్ని వదిలి రైతుగా మారాడు. సహజ వ్యవసాయాన్ని చేపట్టి, పశువులు పెంచుకుంటూ సాధారణమైన రైతు జీవితాన్ని గడుపుతున్నారు. స్థానిక మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థికసాయం చేస్తున్నారు. మంచి ఉద్యోగం చేయాలన్న పట్టుదలతో చదువుకున్న తాను రైతుగా అడుగు వేయడానికి గల కారణాన్ని తన మాటల్లోనే విందాం.

JEEVANA జీవన the family

బ్యాంకు ఉద్యోగం వదిలి..





'మా'ది శ్రీ సత్యసాయి జిల్లా. పెనుకొండ. వ్యవసాయాధారిత కుటుంబం. మా నాన్నా, తాతయ్య పొద్దున లేచిన దగ్గర నుంచి పొలాల్లో పనులకు వెళ్లేవారు. నన్ను, అన్నయ్యను బాగా చదివించారు. చదువుకుని బెంగుళూరులో టాప్ కార్పొరేట్ బ్యాంకులైన ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి, పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో పది సంవత్సరాలు ఉద్యోగం చేశా. మంచి జీతం. ఉదయాన్నే ఆఫీసుకు బయల్దేరి వెళతా. తిరిగి ఇంటికి వచ్చేసరికి రాత్రి ఎనిమిది అయ్యేది. బాగా అలిసిపోయేవాడిని. మానుకోవాలనిపించేది. వెనక్కి రావాలంటే అవమానంగా చూస్తారేమో అని ఆగిపోయేవాడిని. చదువుకున్నాం కదా! ఈ బ్యాంకు ఉద్యోగం ఎందుకు వదులుకోవాలి అని మనసుకు చెప్పుకునేవాడిని. కొన్నాళ్లకు యాంత్రికం అయ్యింది. నాతో కలిసి పనిచేసే ఓ స్నేహితుడు క్యాన్సర్‌తో బాధపడుతూ, సంవత్సరం తర్వాత చనిపోయాడు. ఎందుకు ఇలా జరిగిందని వివరాలు తెలుసుకున్నా. కలుషితమైన ఆహారం, రసాయనాల వల్ల అని చెప్పారు. చాలా రోజులు ఆలోచించా. ఎంత సంపాదించినా తృప్తి కలగడం లేదు. ఇలా కలుషితమైన గాలి పీలిస్తూ, రోడ్ల మీద తిరుగుతూ అక్కడ ఉండాలనిపించలేదు. బాల్యం గుర్తొచ్చింది. పల్లెటూరులో పచ్చని పొలాల మధ్య, స్వచ్ఛమైన గాలి, గడ్డ పెరుగు, బాల్య స్నేహితులు... ఇలా ఎన్నో ఆలోచనలు నిద్రపట్టనివ్వలేదు. వెంటనే ఇంటికి తిరిగి వచ్చా.

రైతులు నవ్వారు ...

ఇంట్లో నానమ్మ, తాతయ్య, అమ్మ, నాన్న, అన్న, వదిన పిల్లలు, అత్త, బావలు ఇలా ఉమ్మడి కుటుంబంలో పెరిగిన నాకు తిరిగి ఉద్యోగానికి వెళ్లాలని అనిపించలేదు. వ్యవసాయం చేస్తానని చెప్పినప్పుడు ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదు. కాని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు. అలా ఏడేళ్ల క్రితం సహజ పద్ధతిలో వ్యవసాయం చేయడం ప్రారంభించా. మా పక్క పొలాల్లో రైతులు మిర్చి పండిస్తే మేం వేరశనగ పండిస్తాం. మొదట ఖరీఫ్, రబీ సీజన్లు వచ్చే ముందు పొలంలో ఏం చేయాలో తెలిసేది కాదు. దాచుకున్న డబ్బు అంతా వ్యవసాయానికి పెట్టుబడి పెట్టా. ట్రాక్టర్ వినియోగించకుండా ఎద్దులతో దున్ని విత్తనాలు వేశా. రసాయన మందులు చల్లలేదు. అది చూసి 'నీకు వ్యవసాయం చేయడం రాకపోతే. మానుకో' అని నవ్వారు. అయినా పట్టువదలకుండా సేంద్రియ మందులతో కూరగాయలు పండించా. పాల ఉత్పత్తుల కోసం లక్షలు ఖర్చుపెట్టి మంచి విత్తనం గల పాడి గేదెలను కొనుగోలు చేశా. కల్తీ లేని పాలు అమ్ముతున్నామని తెలిసి పక్క ఊర్ల నుంచి వచ్చి మరీ కొనుగోలు చేశారు. స్వచ్ఛమైన నెయ్యి కూడా వచ్చేది. పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబిస్తూ కూరగాయలు పండిస్తున్నామని జనం ఆసక్తి కనబరిచేవారు. పొలం దగ్గరకు వచ్చి మరీ కొనుగోలు చేసేవారు. దాంతో ఒక ఫారమ్ ప్రారంభించాలని నిర్ణయించా. దానికి అన్నయ్య సహకారం తీసుకున్నా.

వినియోగదారులకు సేంద్రియ, తాజా కూరగాయలు, పప్పులు, పాల ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో మూడేళ్ల క్రితం 'అమిత్ హెబ్బేవు ఫారమ్' ప్రారంభించా. ఫారమ్‌లో, పంట పొలాల్లో పనిచేసేందుకు సుమారు వంద మంది మహిళలు వస్తున్నారు. వారికి ఉపాధి చూపుతున్నా. ఇప్పుడు నాకు లాభం కన్నా కుటుంబానికి తగ్గ ఆదాయం వస్తుంది. డబ్బు వెంట పరుగు తీయడం లేదు. ఆ పచ్చని పొలాలు, పశువులను చూస్తూ జీవితం గడుపుతుంటే చాలా తృప్తిగా ఉంది.' అంటారు అమిత్ కిషన్.

ఇలా 'అలవాటు' చేయండి...

పిల్లలు పొద్దున్నే ఒక పట్టాన లేవరు. స్కూలుకు తయారుచేయాలంటే కత్తిమీద సామే అవుతోంది ప్రతి తల్లికీ. టైంకి లేవరు. బ్రష్ చేయరు. స్నానం, టిఫిన్ సంగతి సరేసరి.. కాస్త పెద్ద పిల్లలైతే వాళ్ల పనులు వాళ్లే చేసుకుంటారు. మరి చిన్న పిల్లల సంగతో.. వారికి ఏం చెప్పాలి? మనం ఎలా చెబితే వాళ్లకు అర్థం అవుతుంది? చిన్న పిల్లలున్న ప్రతి తల్లినీ, తండ్రినీ వెంటాడే ప్రశ్నలివి.

లాస్య, కొడుకు చింటూను అదే పనిగా నిద్ర లేపుతున్నా వాడు లేవడం లేదు. వంట చేసుకుంటూ పదే పదే బెడ్ రూంకి వెళ్లడం చింటూను లేపడం ఆమె దినచర్యలో భాగమవుతోంది. మొదట్లో విసుగుపుట్టి బలవంతంగా లేపి కూర్చొబెట్టేది. అప్పుడు వాడు ఏడుపు లంకించుకుని ఒకపట్టాన ఆపేవాడు కాదు. అదో సెర.. అందుకే ఈమధ్య కాస్త బుజ్జగిస్తూ.. బతిమాలుతూ నిద్రలేపడం మొదలుపెట్టింది. ఎన్నాళ్లు ఇలా.. అమ్మ మాట చింటూ వినాలంటే ఏం చేయాలి?



'చింటూ.. పొద్దున్నే నిద్రలేవడం మంచి అలవాటు.. త్వరగా బ్రష్ చేసి, స్నానం, టిఫిన్ చేసేసి స్కూలుకు టైంకి తయారవ్వడం గుడ్ హ్యాబిట్ తెలుసా.. రేపటి నుండి నువ్వు ఈ మంచి అలవాట్లు నేర్చుకోవాలి. చెడ్డ అలవాట్లను వదిలేయాలి' అని లాస్య చాలా సీరియస్‌గా టిఫిన్ చేస్తున్న చింటూతో చెబుతోంది. చింటూ అమ్మ వంక అమాయకంగా చూస్తూ.. 'అమ్మా.. మంచి అలవాట్లు.. చెడ్డ అలవాట్లు అంటే ఏంటి?' అని అడిగాడు.. నిజమే కదా.. ఆ పిల్లవాడికి వాటి అర్థం తెలుస్తుందా.. కాని మనలో చాలామంది తల్లిదండ్రులు పదే పదే పిల్లలతో అవే మాటలు అంటుంటారు.

అందుకే పిల్లలకు అలవాట్ల గురించి అర్థమయ్యేలా చెప్పాలి. అది రోజువారీ పని అని, దినచర్యలో భాగమని చెప్పాలి. ఉదయం లేవడం దగ్గర నుండి రాత్రి పొద్దుపోయే వరకు చేసే అన్ని పనులు అలవాట్లేనని వివరించాలి. మంచి, చెడుల గురించి చెప్పేటప్పుడు.. సమయానికి అన్ని పనులు చేయడం వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని, అలా చేయకపోవడం వల్ల ఇంట్లోనూ, స్కూల్లోనూ చాలా ఇబ్బందిగా ఉంటుందని చెప్పాలి. ఉదాహరణకు ఆలస్యంగా నిద్ర లేవడం వల్ల అన్ని పనులు ఆలస్యంగా అయి స్కూలుకు లేటవుతుందని చెప్పండి. అప్పుడు అందరిముందు టీచరు కోప్పడతారని, ఆ ప్రభావం చదువుపై పడి చదువులో వెనకబడతారని చెప్పండి. స్కూలుకు టైంకి వెళ్లి, పాఠాలు శ్రద్ధగా వింటే చదువులో ముందుండవచ్చని వివరించండి. అప్పటికీ పిల్లలు వినకపోతే.. స్కూల్లో టీచర్లు పిల్లలను కోప్పడితే అమ్మానాన్న బాధపడతారని చెప్పండి. అప్పుడు తాము చేసే పనుల వల్ల అమ్మానాన్న ఇబ్బంది పడతారని పిల్లలకు అర్థమవుతుంది.

మంచి నడవడికకు ఇంటి నుండే మొదటి బీజం పడాలి. నిద్రలేవడం చాలా సాధారణ విషయమైనా అక్కడ నుండే వారికి అలవాట్లను పరిచయం చేయాలి. పాఠాలు శ్రద్ధగా వినడం, హోంవర్క్స్ చేయడం, పెద్దవాళ్లను గౌరవించడం, డబ్బు ఆదా చేసుకోవడం వంటి విషయాలన్నీ అలవాట్లేనని చెప్పాలి. మంచి, చెడ్డల వ్యత్యాసం కూడా తెలియజేయాలి. కాస్త ఓర్పుతో.. సహనంతో వారికి అర్థమయ్యేలా చెప్పాలి. ఒక్కసారే.. వెంటనే కాకపోయినా నిదానంగా వారి అలవాట్లను మార్చుకుంటూ ఉంటారు. పిల్లలు కదా, మనం ఎంత ఓపిగ్గా చెబితే అంత శ్రద్ధగా వింటారు.

విద్యుత్ భారాలు ఆపకపోతే మరో ఉద్యమం

- వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వినతి

ప్రజాశక్తి - యంత్రాంగం

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, విద్యుత్ రంగంలో కార్పొరేట్ల దోపిడీ ఆపకపోతే భవిష్యత్ అంధకారమే అవుతుందని వామపక్షాల నాయకులు అన్నారు. సామాన్యులపై భారాలు ఆపకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బాదుడు ఆగాలంటే ప్రజాపోరు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఆందోళనలు చేపట్టారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసిపిఐ నేతలు వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28, 30 తేదీల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు నిర్వహించి, సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే విద్యుత్ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడులో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీకాకుళం జిల్లా మందస మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రకాశం జిల్లా దర్శిలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కడప జిల్లా బద్వేలులో స్థానిక విద్యుత్ ఎడిఇ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాదుడుపై ప్రజలు తిరుగుబాటు చేసి, కార్పొరేట్ల దోపిడీకి అడ్డుకట్ట వెయ్యాలని, ప్రభుత్వ అవినీతిని నిగ్గదీయాలని, ఐక్యతతో ప్రజలు ఉద్యమించాలని నాయకులు కోరారు. పోరుమామిళ్లలోని విద్యుత్ ఎడి భవనం వద్ద ధర్నా నిర్వహించారు.గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు.



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వన్డేల్లో జింబాబ్వేకు రికార్డు గెలుపు

అమెరికాపై 304పరుగుల తేడాతో గెలుపు

హరారే: వన్డేల్లో జింబాబ్వే జట్టు రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్-ఏ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు అమెరికాపై ఏకంగా 304పరుగుల తేడాతో గెలిచింది. వన్డే చరిత్రలో అత్యధిక పరుగుల తేడాతో గెలిచిన జట్ల జాబితాలో జింబాబ్వే రెండోస్థానంలో నిలిచింది. తొలిస్థానంలో ఇండియా 317పరుగుల తేడాతో శ్రీలంకపై నెగ్గి ప్రథమస్థానంలో ఉంది. ఇక జింబాబ్వే జట్టుపరంగా వన్డేల్లో 304పరుగుల తేడాతో గెలుపొంది రికార్డు నెలకొలింది. హరారే వేదికగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 408పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. కెప్టెన్ విలియమ్సన్(174) భారీ శతకానికి తోడు ఓపెనర్ గుంబే(78) అర్ధసెంచరీతో మెరిసాడు. పరాడ్కర్‌కు మూడు, జెస్సీ సింగ్‌కు రెండు, కెంజిజేకు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో అమెరికా జట్టు 25.1 ఓవర్లలో 104పరుగులకు ఆలౌటైంది. అభిషేక్(24) టాప్ స్కోరర్. రిచర్డ్స్, సికిందర్ రాజాకు రెండేసి, ఎర్విన్, జోంగ్వే, రియాన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విలియమ్సన్‌కు లభించింది.



విలియమ్సన్ (174 పరుగులు)

ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్

వన్డేల్లో భారీ విజయాలు..
317పరుగులు : ఇండియా; శ్రీలంకపై, తిరువనంపురం(2023)
304పరుగులు : జింబాబ్వే; అమెరికాపై, హరారే(2023)
290పరుగులు : న్యూజిలాండ్; ఐర్లాండ్‌పై, అబెర్డెన్, 2008

విండీస్‌పై నెదర్లాండ్స్ 'సూపర్' విజయం

హరారే వేదికగా మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు సూపర్ ఓవర్‌లో వెస్టిండీస్ జట్టుకు ఝలక్ ఇచ్చింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు 6వికెట్ల నష్టానికి 374పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో నెదర్లాండ్స్ జట్టు 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 374పరుగులు చేసింది. హోల్డర్ వేసిన సూపర్ ఓవర్లో నెదర్లాండ్స్ జట్టు 6బంతుల్లో 30పరుగులు చేయగా.. నెదర్లాండ్స్ బౌలర్ వాన్ బీక్ వేసిన ఓవర్లో విండీస్ జట్టు 8పరుగులే చేసి ఓటమిపాలైంది. దీంతో నెదర్లాండ్స్ జట్టు 22పరుగుల తేడాతో గెలిచింది. ఈ రెండు జట్లు ఇప్పటికే సూపర్-6కు చేరిన విష యం తెలిసిందే. 29నుంచి సూపర్-6 పోటీలు ప్రారంభం కానున్నాయి. సూపర్- 6లో టాప్‌లో ఉన్న రెండుజట్లు ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించనున్నాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వాన్ బీక్‌కు లభించింది.



సూపర్ ఓవర్

ఐర్లాండ్		వెస్టిండీస్
4 (వాన్ బీక్)	1	6 (ఛార్లెస్)
6 (వాన్ బీక్)	2	1 (ఛార్లెస్)
4 (వాన్ బీక్)	3	1 (హోప్)
6 (వాన్ బీక్)	4	ఔట్ (ఛార్లెస్)
6 (వాన్ బీక్)	5	ఔట్ (హోల్డర్
4 (వాన్ బీక్)	6	
30పరుగులు (బౌలర్: హోల్డర్)		8 పరుగులు (బౌలర్: వాన్ బీక్)

రైతులకు మెరుగైన సేవలందించడంలో

వ్యవసాయ సలహా మండళ్ల పాత్ర కీలకం

వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించే కార్యక్రమంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండళ్ల పాత్ర కీలకమని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో రాష్ట్ర స్థాయి వ్యవసాయ సలహా మండలి మొదటి సమావేశం కాకాణి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 68 శాతం ఉన్న రైతుల సంక్షేమానికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి పలు రాష్ట్రాలకు ఎంతో ఆదర్శంగా నిలిచామన్నారు. ఐక్యరాజ్యసమితికి అనుబంధ సంస్థగా ఉన్న ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఛాంపియన్ అవార్డుల నామినేషన్‌కు రైతు భరోసా కేంద్రాలు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలోని 147 గ్రామీణ నియోజకవర్గాల్లో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇప్పటికే 73 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు పనులను పూర్తి చేశామన్నారు. జులై 8న 52 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను సిఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో సంస్థాగత మార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరను కల్పించడమే కాకుండా ఇ-క్రాప్ విధానం ద్వారా ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దళారుల ప్రమేయం లేకుండా ఇ-క్రాప్ ఆధారంగా ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోళ్లను పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండళ్లు కూడా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, సహకారశాఖ స్పెషల్ సిఎస్ ద్వివేది, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనరు సిహెచ్ హరికిరణ్, రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ ఉపాధ్యక్షులు ఎంవిఎస్ నాగిరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రేటర్ నోయిడాలో 28న విజయోత్సవం

- ఎఐకెఎస్ నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో 61 రోజుల రైతుల పోరాటం తరువాత పరిశ్రమలశాఖ మంత్రి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందని ఎఐకెఎస్ నాయకులు తెలియజేశారు. సోమవారం నాడిక్కడ ఎఐకెఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, కోశాధికారి పి కృష్ణప్రసాద్, రైతు పోరాటానికి నాయకత్వం వహించిన నేతలు రూపేష్ వర్మ, వీర్‌సింగ్ నగర్, బ్రహ్మపాల్ సుబేదార్, సురేశ్ ముఖ్య, నిషాత్ రావల్, మహరాజ్‌సింగ్ ప్రధాన్ మాట్లాడుతూ.. నోయిడా పోరాటాన్ని విచ్ఛిన్నం చేసేందుకు 20 రోజులపాటు నాయకులను జైల్లో పెట్టి లాఠీచార్జి చేసిన యోగి ప్రభుత్వం చివరికి మోకరిల్లాల్సి వచ్చిందన్నారు. డిమాండ్లన్నిటినీ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఆమోదించిందని, చారిత్రాత్మక పోరాట విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. బుధవారం గ్రేటర్ నోయిడాలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ నెల 28న గ్రేటర్ నోయిడాలో, జులై 10న రాష్ట్రాల్లోనూ విజయోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఈ నెల 30న నోటిఫికేషన్‌తో కమిటీ ఏర్పాటు అమల్లోకి రానుందని, ఛైర్మన్‌గా మంత్రితోపాటు గ్రేటర్ నోయిడాకు చెందిన ఇద్దరు ఎంపిలు, ఎమ్మెల్యేలు, పారిశ్రామికాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, అథారిటీ సిఇఒలు కూడా కమిటీలో ఉంటారు. ఏడు నుంచి పదకొండు మంది రైతు నాయకులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. కమిటీ నివేదికను జులై 15లోగా సమర్పించాలి. 13 ఏళ్ల క్రితం, గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీ స్వాధీనం చేసుకున్న భూమిని జాబితా చేయడం, బాధితులకు చట్టపరమైన పరిహారం, పునరావాసం, అలాగే నలభై చదరపు మీటర్ల భూమిని నిర్ధారించడం వంటి గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీ డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చింది' అని తెలిపారు.

తిరుగుబాటు వెనక అమెరికా!

రష్యా విదేశాంగ మంత్రి లావ్రోవ్ వెల్లడి

మాస్కో: విఫలమైన తిరుగుబాటు వెనుక అమెరికా పాత్ర ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చెప్పారు. తనతో విభేదించే దేశాల ప్రభుత్వాలను మార్చేందుకు అమెరికా పన్నని కుట్ర లేదు. తన ప్రపంచాధిపత్యానికి అడ్డంకిగా ఉన్న ప్రభుత్వాలను కూలదోసి, తన ప్రయోజనాలను నెరవేర్చే తొత్తు ప్రభుత్వాలను నెలకొల్పేందుకు అది ఎప్పుడూ కుతంత్రాలు పన్నుతూనే ఉంటుందని సోమవారం ఆర్‌టి చానెల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

రష్యాకు చైనా పూర్తి మద్దతు

తిరుగుబాటును భగ్నం చేసి దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు పుతిన్ చేస్తున్న యత్నాలకు చైనా తన పూర్తి మద్దతు ప్రకటించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆదివారం తన వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ప్రకటనలో రష్యాలో తాజా పరిణామాలపై అధికారికంగా తన వైఖరిని వెల్లడిం చింది. రష్యాలో తిరుగుబాటు యత్నం ఆ దేశ ఆంతరంగిక వ్యవహారమని, అయితే, పొరుగున ఉన్న మిత్ర దేశంగా, కొత్త శకంలో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగి ఉన్న దేశంగా తాము రష్యా సుస్థిరత, అభివృద్ధిని పరిరక్షించేందుకు చేస్తున్న యత్నాలకు పూర్తి మద్దతు ఇస్తున్నామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు.

న్యూయార్క్ టైమ్స్ ఆక్రోశం

రష్యాలో వాగ్నర్ తిరుగుబాటు యత్నాన్ని ఉపయోగించుకోవడంలో ఉక్రెయిన్ విఫలమైందని అమెరికన్ పత్రిక న్యూయార్క్ టైమ్స్ ఆక్రోశం వెళ్లగక్కింది. ఉక్రెయిన్‌లో రష్యన్ బలగాలను వెనక్కి తరిమేందుకు వచ్చిన ఒక అవకాశాన్ని అది చేతులారా జారవిడుచుకుందని టైమ్స్ పేర్కొంది. తిరుగుబాటు సమయంలో సైతం రష్యన్ బాలగాలు ఉక్రెయిన్‌లోని వివిధ లక్ష్యాలపై క్షిపణి దాడులను సాగించిందని తెలిపింది.

వాగ్నర్‌పై ఆఫ్రికా దేశాలు ఆందోళన

తిరుగుబాటుకు యత్నించి విఫలమైన ప్రైవేట్ మిలిటరీ వాగ్నర్ గ్రూపు పై రష్యా ప్రభుత్వం కఠిన వైఖరి తీసుకున్నందున ఇప్పటికే ఆ సంస్థ సేవలను వినియోగించుకునేందుకు కాంట్రాక్టు కుదుర్చుకున్న ఆఫ్రికన్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.కిరాయి సైన్యం వాగ్నర్ గ్రూపు సేవలు ఇంతకుముందులాగే ఇప్పుడు అందుబాటులో ఉంటాయా అనేదానిపై రష్యా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈ గ్రూపుతో కుదుర్చుకున్న ఒప్పందాలు అనిశ్చితిలో పడ్డాయి.

గ్రీస్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ న్యూడెమోక్రసీ విజయం

ఏథెన్స్ : గ్రీస్‌లో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కన్జర్వేటివ్ న్యూ డెమోక్రసీ పార్టీ విజయం సాధించింది. మే 21 పోలింగ్ జరగ్గా, ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. 300 సీట్లున్న పార్లమెంటులో కన్జర్వేటివ్ న్యూడెమోక్రసీ పార్టీ 158 స్థానాలను గెలిచింది. ఆ పార్టీకి చెందిన ఆ దేశ ప్రధాని కైరియోకాస్ మిటోటాకిస్ 40.56 శాతం ఓట్లను పొందారు. ఆయన ప్రత్యర్థి వామపక్ష సిరిజా పార్టీకి చెందిన అలెక్సిస్ సిప్రస్ 17.83 శాతం ఓట్లను సాధించి రెండో స్థానంలో నిలిచారు. దీంతో, మిటోటాకిస్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలను స్వీకరించనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68